T.T.D. Religious Publications Series No. 992
Price :

## గుజ్జరి (ఏకతాళి)

శ్రీవేంకటగిరి దేవా!
నా దేహంబు నీవుండెడి నిత్యనివాసంబు!
నా జ్ఞాన విజ్ఞానంబులు నీ యుభయ పార్శ్వంబుల దీపంబులు!
నా ముకుఁజెఱమల యూర్పులు నీ ఇరుదెసలం బట్టెడి యాలవట్టంబులు!
నా మనోరాగంబు నీకుం జంద్రకావి వలువ!
నీకు మ్రొక్క నెత్తిన చేతులు రెండును మకరతోరణంబులు!
నా భక్తియే నీకు సింహాసనంబు!
నా మేనం బొడమిన పులకలు నీకు గుదులు గుచ్చి యర్పించిన పూదండలు!
నే మిమ్ము నుతియించిన నుతుల యక్షర రవంబులు
భేరీ భాంకార ఘంటానినాదంబులు!
నా పుణ్య పరిపాక ఫలంబులు నీకు నైవేద్య తాంబూలాదులు!
మదీయ నిత్యసేవాసమయ నిరీక్షణంబులు
నీ సర్వాంగంబుల నలందిన తట్టుపునుంగు!
నా సాత్త్విక గుణంబు నీకు ధూపపరిమళంబు
నీవు దేవదేవుండవు నే నర్చకుండను!
ఈ రీతి నిత్యోత్సవంబు నాయందు నవధరింపవే, శ్రీవేంకటేశ్వరా!

–తాళ్లపాక పెదతిరుమలాచార్యుల వైరాగ్యవచనమాలిక.

Published by **Sri M.G.Gopal,** I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

నిత్యకల్యాణపురం

# శ్రీనివాస మంగాపురం

–జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

నిత్యకల్యాణపురం

# శ్రీనివాస మంగాపురం


రచన

**జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**

**తిరుపతి**



**ప్రచురణ**

**తిరుమల తిరుపతి దేవస్థానములు తిరుపతి**

**2014**

# SRINIVASA MANGAPURAM

**By**
Julakanti Balasubramanyam

T.T.D. Religious Publications Series No.992

© All Rights Reserved

*First Edition:- 2013*

*Re-Print:- 2014*

Copies: 3000

*Published by :*

**M.G.GOPAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***

Office of the Editor-in-Chief,
T.T.D, Tirupati.

*Printed at :*

Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

**" శ్రీనివాసార్చనం సమం**
**నాధికం పుణ్యమస్తి వై "**

అని పురాణోక్తి! శ్రీనివాసభగవానుని అర్చించడం కంటె అధికమైన పుణ్యకార్యంగాని, కనీసం సాటిరాగల పవిత్రకార్యంగాని లేనే లేదు. ప్రధానంగా ఈ కలియుగంలో!

అట్టి ఘనవేంకటపతి నిలిచివున్న దివ్యక్షేత్రం వేంకటాచలం. తిరుమలక్షేత్రంతోపాటు, శ్రీవేంకటేశ్వరస్వామివారికి చాల అనుబంధం వున్న తిరుచానూరు, నారాయణవనం, శ్రీనివాసమంగాపురం వంటి అనేక దివ్యస్థలాలు వేంకటాచల దివ్యగిరుల పరిసరాల్లో చాలానే వున్నాయి.

శ్రీపద్మావతిఅమ్మవారి అనుగ్రహంకోసం వేంకటేశ్వరస్వామి పంద్రెండేండ్లపాటు తపస్సు చేసిన పరమపావనక్షేత్రం తిరుచానూరు. అదే అలమేలుమంగ పట్నం!

ఆకాశరాజుపుత్రిక పద్మావతిని శ్రీనివాసుడు పరిణయమాడి కల్యాణవేంకటేశ్వరునిగా నిలిచిన దివ్యమైన స్థలం నారాయణవనం!

నూతన కల్యాణదంపతులైన శ్రీపద్మావతీశ్రీనివాసులు ఇరువురు సుమారు ఆరుమాసాలపాటు విహరించిన నిత్యకల్యాణపురం శ్రీనివాస మంగాపురం!

ఒకనాడు, పరమపుణ్యప్రదములైన ఈ క్షేత్రాలన్నీ ఉత్సవాలతో ఊరేగింపులతో తిరుమలక్షేత్రానికి దీటుగా, సాటిగా వెలుగొందాయి.

అనేక కారణాలవల్ల కాలాంతరంలో మరుగున పడిన ఆ దివ్యక్షేత్రాలను అభివృద్ధిపరచడంతో పాటు, వాటి స్థలపురాణాలను, మహిమలను విస్తృతంగా ప్రచారం చెయ్యాలని తి.తి.దేవస్థానం సంకల్పించింది. అంతేగాక

ఆ దివ్యక్షేత్రాల్లో ఘనంగా ఉత్సవాదులను. ఊరేగింపులను నిర్వహించి, పునర్వైభవాన్ని సంతరింపజేయాలన్న మహదాశయంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆ దిశగా చర్యలను చేపట్టింది..

అలాంటి దివ్యక్షేత్రాల్లో " **శ్రీనివాసమంగాపురం** " ప్రసిద్ధమైంది. నూతన కల్యాణదంపతులైన శ్రీపద్మావతీశ్రీనివాసులు విహరించినందువల్ల పరమపునీతమైన దివ్యస్థలంగా, నిత్యకల్యాణపురంగా పేరుపొందిన శ్రీనివాసమంగాపురం స్థలపురాణాన్ని, సంక్షిప్త చరిత్రను, సేవల వివరాలను అందరికీ అర్థమయ్యేలా సరళమైనశైలిలో అందజేసిన శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం గారు ధన్యులు.

తి.తి.దేవస్థానం ప్రచురించిన ఈ గ్రంథం ద్వారా శ్రీనివాసమంగాపుర క్షేత్ర మహత్వాన్ని చదివి పాఠకులు ధన్యత నొందగలరని ఆంకాక్షిస్తూ.

*సదా శ్రీవారి సేవలో....*

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# విషయసూచిక


| | |
|---|---|
| ముందుమాట | iii |
| శ్రీనివాసమంగాపురం | 1 |
| స్థలపురాణం | 2 |
| అగస్త్యుని తరలిరాక! | 3 |
| శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయం | 6 |
| అగస్త్యుడి ఆతిథ్యం | 8 |
| శ్రీవారి మెట్టు | 12 |
| అలుమేలుమంగ సాక్ష్యం | 16 |
| వెంకన్నసేవలో వెర్రి బాగులమ్మ! | 20 |
| అర్చకులు శ్రీసుందరరాజస్వామి | 24 |
| తి.తి.దేవస్థానం ఆలయాల్లో విలీనం | 31 |
| శ్రీ భక్తాంజనేయస్వామి | 32 |
| మహాద్వార రాజగోపురం | 32 |
| బలిపీఠం-ధ్వజస్తంభం | 33 |
| వంటశాల | 33 |
| కల్యాణ మండపం | 33 |
| ఘంటా మండపం | 34 |
| ద్వారపాలకులు | 34 |
| అర్ధ మండపం | 35 |

శయన మండపం 35
అంతరాళం 35
గర్భాలయం 37
శ్రీవారి మూలమూర్తి 37
ఉత్సవ వైభవం 40
నిత్యోత్సవాలు 40
వారోత్సవాలు 42
మాసోత్సవం 43
వార్షికోత్సవాలు 43

# శ్రీనివాస మంగాపురం

**“నిత్యాత్ముఁడై యుండి నిత్యుఁడై వెలుఁగొందు**
**సత్యాత్ముఁడై యుండి సత్యమై తానుండు**
**ప్రత్యక్షమై యుండి బ్రహ్మమైయుండు సం-**
**స్తుత్యుఁ డీ తిరువేంకటాద్రి విభుఁడు”**

–తాళ్లపాక అన్నమాచార్యులు

సువర్ణముఖీ–కల్యాణీ–భీమానదుల త్రివేణీ సంగమ పవిత్రజలాలు ప్రవహించిన పుణ్యభూములకు ఆలవాలం ఈ ప్రాంతం!

అగస్త్యమహర్షి వంటి తపోమూర్తుల ఆశ్రమ వాటికలకు నిలయం ఈ ప్రాంతం!

నూతనవధూవరులైన శ్రీపద్మావతీ శ్రీనివాసులు ఇరువురు విహరించడం వల్ల పావనమైన కల్యాణపురం శ్రీనివాసమంగాపురప్రాంతం!

వేదపురుషుడైన వేంకటేశ్వరునికి నాలుగు వేదాలను వినిపించిన ఘనాపాఠుల అగ్రహారాలకు నిలయం ఈ ప్రాంతం!

ఆనందనిలయుడు ఆరగించే దివ్యాన్నాల కోసం, ఇచట మాగాణి భూముల్లో సన్నని రాజ భోగాలవడ్లను పండించే రైతన్నలకు నిలయం ఈ ప్రాంతం!

ఇన్ని ప్రత్యేకతలు వున్న ఈ ప్రాంతం మధ్యలో కేంద్ర బిందువై కల్యాణ పరంపరల్ని గుప్పిస్తూ రాజగోపురంతో తూర్పుముఖంగా దర్శనమిస్తున్న ఆలయమే శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరుని దేవాలయం!

చాలదూరం నుండే ఏడు బంగారుకలశాలతో తళతళమెరుస్తూ కనపడుతున్న ఎత్తైన రాజగోపురంతో చూసిన వారికి ప్రశాంతచిత్తాన్నీ,

ఆనందాన్నీ ప్రసాదిస్తున్న ఆధ్యాత్మికనిలయం శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం.

తిరుపతి పట్టణానికి సరిగ్గా పడమటి దిక్కున 10 మైళ్లదూరంలో నెలకొనివున్న నిత్యకల్యాణపురం శ్రీనివాసమంగాపురం!

## స్థల పురాణం

శ్రీకల్యాణవేంకటేశ్వరునికి శ్రీనివాసమంగాపురక్షేత్రానికి అద్భుతమైన స్థలపురాణం వినవస్తోంది.

చాలకాలం క్రిందట జరిగిన కథ ఇది!

శ్రీనివాసమంగాపురం పరిసరప్రాంతంలో సువర్ణముఖీనది ఒడ్డునే ఒక చక్కటి ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకొన్నాడు అగస్త్య మహర్షి.

ఆ సమయంలోనే నూతనవధూవరులైన శ్రీపద్మావతీ శ్రీనివాసులు, పెళ్లిబట్టలతోనే ఆదివరాహక్షేత్రానికి వెళుతూ అగస్త్యుని ఆశ్రమానికి వచ్చారు. వారికి ఆతిథ్యమిస్తూ, తన మునివాటికలోనే కొంతకాలం వుండమని ప్రార్థించాడు మునీశ్వరుడు. సరే! అన్నాడు శ్రీనివాసుడు

బాగుంది! ఈ సందర్భంలో కొన్ని సందేహాలు కలుగుతాయి.

అసలు అగస్త్యముని ఇక్కడే ఈ ప్రాంతంలోనే ఎందుకు ఆశ్రమాన్ని ఏర్పాటు చేసికొన్నాడు? ఆయన ఎక్కడి నుంచి వచ్చాడు? ఎందుకొచ్చాడు?

కల్యాణ దంపతులు పద్మావతీశ్రీనివాసులు అగస్త్యుని దగ్గరికి ఏకార్యం మీద వచ్చారు?

ఈ సందేహపరంపరలకు సమాధానాలు తెలుసుకుంటే చాలు. శ్రీనివాసమంగాపురం క్షేత్ర ప్రాశస్త్యం, ఔన్నత్యం అవగతమవుతాయి.



## అగస్త్యుని తరలి రాక!

చాల ఏండ్లకు పూర్వం కాశీక్షేత్రంలో జరిగిన సంగతి! ఆ క్షేత్రాన్నే 'వారణాసి' అంటారు కూడా!

ఆ క్షేత్రంలో పార్వతీ పరమేశ్వరుల పెళ్లి జరుగుతున్న సమయం అది. ఆ పెళ్ళికి ముక్కోటి దేవతలు తరలివచ్చారు. ఒక్క దేవతలేనా! ఎందరో మునులు, యోగులు, యక్ష, కిన్నర కింపురుషాది గంధర్వులు, శివకింకరులు, ...ఇలా ఎంతోమంది ఆదిదంపతుల పెళ్లి వేడుకలకు వచ్చారు. ఇలా అన్నిలోకాల్లోని వారంతా ఒకచోట గుమిగూడటంతో వాళ్ల బరువుకి భూమి ఒకవైపుకు వాలింది. అటు ఇటు ఊగిసలాడింది.

ఈ హఠాత్పరిణామానికి అందరూ భయపడ్డారు. భీతావహులయ్యారు.

ఆ సమయంలో అక్కడే వున్న దేవశిల్పి విశ్వకర్మ ఒక మాటన్నాడు. భూమి సమంగా నిలవడానికి ఒకే ఒక్కమార్గం వుంది. అని.

ఎలా! ఎలా! తొందరగా చెప్పవయ్యా! అని ఏకకంఠంతో చాలమంది అడిగారు.

ఎలా అంటే, " అందరూ ఒక ఎత్తు, అగస్త్యుడొక ఎత్తు ". ఆ మహర్షి కాశీని విడిచి దక్షిణాదికి వెళితే ఈ ఉపద్రవం తొలగుతుందన్నాడు! విశ్వకర్మ. వెంటనే అగస్త్యుడు, చుర చుర చూస్తూ 'విశ్వకర్మా! నన్ను ఈ కాశీ క్షేత్రం నుండి, ముఖ్యంగా, శివపార్వతుల కల్యాణ వేడుకలు చూడకుండా వెళ్లేట్లుగా పలుకుతావా! అనుభవించు నీ కర్మ! ఇప్పటినుంచి నీవూ, నీవాళ్లు ఏ కర్మ (పని) చేసినా ఫలితం (కూలి) మాత్రం తక్కువగా ఉండుగాక!' అని శపించాడు.

విశ్వకర్మ అన్నాడు! 'మహర్షీ! లోకకల్యాణం కోసం మాత్రమే సలహా ఇచ్చాను తప్ప, నిన్ను కాశీనుండి పంపివేయాలన్న దృష్టి నాకు లేదు. నాకు

అంతటి శక్తి వుందా? ఇలా తొందరపాటుతో శపించావే! ఇక మీదట నీవు వల్లించే మంత్రాలు కేవలం వేదతుల్యములై "ద్రావిడ వేదాలు"గా పేరొందుగాక! అని ప్రతి శాపమిచ్చాడు.

ఇద్దర్నీ శాంతింపజేసిన పరమేశ్వరుడు "లోకకల్యాణం కోసం అందరూ పాలుపంచుకోక తప్పదు. ప్రతీదీ భగవన్నిర్ణయం మేరకే జరుగుతుంది". అంటూ పరమశివుడు అగస్త్యుణ్ణి ఇలా ఆదేశించాడు.

మహర్షీ! దక్షిణానికి వెళ్లు. మేమూ నీవెంటే వుంటాం. నీవు పాదం మోపిన ప్రతి అడుగూ కాశీక్షేత్రమే! నీవు ప్రతిష్ఠించిన ప్రతి శివలింగం కాశీ విశ్వేశ్వరుడే! ఏమాత్రం సందేహించక జగత్కల్యాణకారకుడవై పుణ్యాన్ని మూట కట్టుకొని చిరకీర్తిని పొందు.

అవశ్యం! అంటూ అగస్త్యుడు బయలుదేరాడు.

మళ్లీ శివుడన్నాడు. 'మహర్షీ ఇంకొక్కమాట! వెళ్తూ, వెళ్తూ ఆ దారిలోనే వక్రబుద్ధితో మేరువుకంటె విపరీతంగా పెరుగుతున్నాడట వింధ్యుడు! మీ శిష్యుడు కదా! వింధ్యుని గర్వాన్ని కొంత అణచివేయి!'

చిత్తం! అంటూ అగస్త్యుడు కాశీక్షేత్రానికి చివరిసారిగా నమస్కరించి దక్షిణానికి నడక సాగించాడు. ఆయనవెంటే నడచింది పతివ్రతామతల్లి లోపాముద్ర!

అంతే! భూమండలం సమంగా నిలిచింది. అందరూ అమ్మయ్య! అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

దారిలో విపరీతంగా పెరుగుతూ సూర్యరథగమనాన్ని ఆటంక పరుస్తున్న వింధ్యుడు అగపడ్డాడు.

వింధ్యా! అని పిలిచాడు గురువైన అగస్త్యుడు.

గురువుగారూ! అంటూ వంగి పాదాభివందనం చేశాడు వింధ్యుడు.



నేను దక్షిణాదికి వెళ్తున్నా! తిరిగి వచ్చేంతవరకు ఇలాగే వంగి, ఒదిగి వుండు అన్నాడు గురువు.

చిత్తం! తమ ఆజ్ఞ! అన్నాడు వింధ్యుడు.

సూర్యరథగమనం సాఫీగా సాగింది. మేరుపర్వతం కంటె ఎత్తుగా ఎదగాలన్న వింధ్యుని అహంకారం అణగింది.

అందుకే 'ఎంతటివారికైనా అహంకారం పతనహేతువు' అన్నారు పెద్దలు.

దక్షిణాదికి వచ్చిన అగస్త్యుడు అనేక క్షేత్రాల్ని సందర్శిస్తూ పవిత్రమైన సువర్ణముఖరీనదీతీరంలోని శ్రీ ఆదివరాహక్షేత్రం దగ్గరికి వచ్చాడు. ఈ ప్రాంతంలో ఎదో తెలియని, వ్యక్తం చెయ్యలేని అనుభూతికి లోనయ్యాడు. ఆనందానికి లోనయ్యాడు. చుట్టూరా పచ్చని పండ్ల చెట్లతో, పూలతీగలతో అలరారుతున్న ప్రకృతిని పరిశీలించి పరవశిస్తూ ఒక తన్మయత్వాన్ని పొందాడు.

ఆ పక్కనే వింతవింతలుగా ఆధ్యాత్మిక తేజస్సులతో ప్రకాశిస్తున్న ఆదివరాహక్షేత్రం ఎత్తైన కొండలను దూరంనుండే చూస్తూ భక్తిగా రెండు చేతులెత్తి నమస్కరించాడు.

సుందరమైన ప్రశాంతమైన ఈ సువర్ణముఖీ-కల్యాణీ-భీమానదుల త్రివేణీసంగమ తీరప్రాంతం, తమ అనుష్ఠానానికి తపస్సుకు అనువైన ప్రదేశంగా నిశ్చయించుకొన్న అగస్త్యుడు ఆశ్రమాన్ని ఏర్పరచుకొన్నాడు. ఆయనతో పాటు ఎందరో మునులు వచ్చి చేరారు. ఇలా ఆ ప్రాంతం మునుల తపోభూమిగా మునిపల్లెగా అలరారింది.

కుంభసంభవుడైన అగస్త్యమహర్షి సువర్ణముఖీ నదీతీరంలో అద్భుతమైన ఒక తేజోలింగాన్ని ప్రతిష్ఠించాడు. ఆ పరమశివుని మహాలింగంతోపాటు

పార్వతీదేవి, గణపతి, కుమారస్వామి ఇలా పరివార దేవతాగణాన్ని ప్రతిష్ఠించాడు. ఆ క్షేత్రం శ్రీ ఆనందవల్లీసమేత శ్రీఅగస్త్యేశ్వరక్షేత్రంగా భాసిల్లుతున్నది. ఆకాశరాజు తమ్ముడు తొండమానుచక్రవర్తి పాలనలో వున్న ఈ ప్రాంతం తొండమనాడుగా పేరొందింది. ఈ క్షేత్రాన్ని వృద్ధిచేసిన తొండమానుని పేరుతో తదుపరి తొండవాడ అగస్త్యేశ్వరక్షేత్రమై "దక్షిణ కాశి"గా అలరారుతూవుంది.

సరిగ్గా ఇదే సమయంలో ఆకాశరాజు కూతురు పద్మావతిని వివాహమాడిన శ్రీనివాసుడు వివాహానంతరం ఆదివరాహక్షేత్రానికి పయనమయ్యాడు. కల్యాణవేళలో ధరించిన పసుపు బట్టలతోనే నూతనవధూవరులైన పద్మావతీశ్రీనివాసు లిరువురూ దారిలో వున్న అగస్త్యుని ఆశ్రమాన్ని సందర్శించారు. దివ్యదంపతులైన లోపాముద్రా అగస్త్యుల ఆశీస్సుల్ని అర్థించారు.

సరే బాగుంది! అసలీ పద్మావతీశ్రీనివాసులెవరు? వాళ్ల పరిణయగాథ ఏమిటి?

ఆ దంపతులు పెళ్లినాటి పసుపు బట్టలతోనే అగస్త్యుని ఆశ్రమాని కెందుకు వచ్చారు? ఆ మహర్షి వారిని తన ఆశ్రమంలో ఎందుకు వుండమన్నాడు?

ఇలాంటి సందేహ పరంపరలు చాలమందికి కలుగవచ్చు. కలుగుతాయి కూడ. వాటిని గూర్చి తెలుసుకుందాం.

## శ్రీపద్మావతిశ్రీనివాసుల పరిణయం

భృగుమహర్షి పరీక్షవల్ల కోపంతో అలిగి వైకుంఠాన్ని వీడిన శ్రీమహలక్ష్మీ భూలోకంలో కొల్హాపురక్షేత్రం (మహారాష్ట్ర) చేరింది. ఆమె వెనుకనే వైకుంఠం నుండి శ్రీనివాసుడు లక్ష్మిని వెదుకుతూ భూలోకం చేరుకున్నాడు. ఆమెకోసం వెదకి వెదకి వేసారి పోయి చివరకు ఆదివరాహక్షేత్రం చేరుకొన్న శ్రీనివాసుడు పుట్టలో తలదాచుకున్నాడు. ఆకలిదప్పుల బాధలకు లోనయ్యాడు.



హిరణ్యాక్షుని వధించిన శ్వేతవరాహస్వామివారి అనుగ్రహంతో వకుళమాత (ద్వాపరయుగంనాటి యశోదమాత) సేవలవల్ల ఊరట చెందుతాడు శ్రీనివాసుడు.

తరువాత వేటకు వెళ్లిన శ్రీనివాసుడు శేషాచలం అడవుల్లో ఏనుగుబారిన పడిన ఆకాశరాజు కూతురు పద్మావతిని రక్షించి, ఆమె మోహంలో పడతాడు. పద్మావతి లేనిదే తాను బతకలేనని భీష్మిస్తాడు శ్రీనివాసుడు.

ఆకాశరాజు కూతురు పద్మావతి ఎక్కడ? అరణ్యాల్లో ఆకు లలముల్ని దుంపల్ని ఆరగించే మనమెక్కడ? అని సందేహించిన వకుళమాతతో ఇలా వివరిస్తాడు శ్రీనివాసుడు.

అమ్మా! పూర్వజన్మలో సీతకోసం లంకకు వెళ్లిన వేదవతే, ఇప్పుడు ఆకాశరాజు కూతురు పద్మావతిగా అవతరించింది. ఆనాడు నేనిచ్చిన వరం వల్ల ఆమెను పరిణయమాడి తీరాలి, తప్పదు. అన్నాడు శ్రీనివాసుడు.

అలాగా! అని ఆశ్చర్యపోయిన వకుళమాలిక పెళ్లికోసం రాయబారాన్ని నెరపింది. దానితో పాటు నారదమహర్షి ఆకాశరాజుకు చేసిన ఉపదేశం వల్లా, ఎరుకలసానిగా శ్రీనివాసుడు ఎరుక చెప్పడంవల్లా, పద్మావతీ శ్రీనివాసుల పరిణయం నిశ్చయింపబడింది.

ఆకాశరాజు రాజధాని నారాయణవనంలో, వైశాఖశుక్లపక్షం దశమీ శుక్రవారం పూర్వఫల్గునీ నక్షత్ర శుభముహూర్తంలో ముక్కోటి దేవతల సాక్షిగా పద్మావతీశ్రీనివాసుల పరిణయం అంగరంగవైభవంగా నిర్వహింపబడింది.

వివాహానంతరం పసుపు బట్టలతో పద్మావతీశ్రీనివాసులిరువురూ వరాహక్షేత్రానికి బయలుదేరారు.

## అగస్త్యుడి ఆతిథ్యం

ఆ దారిలో వెళుతూ వాళ్లిద్దరూ సువర్ణముఖీ-కల్యాణీ-భీమానదుల త్రివేణీ సంగమంలో వెలసివున్న శ్రీఆనందవల్లీ సమేత శ్రీఅగస్త్యేశ్వరక్షేత్రాన్ని, పక్కనేవున్న అగస్త్యమహాముని ఆశ్రమాన్ని సందర్శించారు.

తన ఆశ్రమవాటికను పరమ పావనం చేసిన జగత్కల్యాణ మూర్తులైన శ్రీపద్మావతీశ్రీనివాసదంపతు లిరువురికీ భక్తిపూర్వకమైన స్వాగతాన్ని, సంతృప్తికరమైన ఆతిథ్యాన్ని ఇచ్చాడు అగస్త్యమహాముని.

ఆ తర్వాత, నారాయణవనంలో జరిగిన పెళ్లి వేడుకలను ముచ్చటిస్తూ, ఆకాశరాజు అద్భుతంగా ఘనంగా వివాహతంతును జరిపించాడు. ఆ పెళ్లిలో మరవరాని, మరచిపోలేని ఏర్పాట్లతోపాటు కమ్మని విందుభోజనాలు వడ్డింపులు వర్ణించడానికి ఎవరితరం కాదు. అంటూ అయినా కొత్త పెండ్లికొడుకువు! అత్తవారింట్లో మరికొన్నాళ్లు వుండవచ్చు కదా శ్రీనివాసా! అన్నాడు అగస్త్యమునీంద్రుడు.

మునీంద్రా! మీరన్నది నిజమే! కాని అత్తవారింట్లో ఎక్కువ రోజులు వుండడం ఎంతవరకు సబబు? అయినా ఊరూ పేరూ లేనివాణ్ణి! పైగా పెళ్లికూడా చేసుకొని మరింత బరువు బాధ్యతలు పెంచుకున్నాను. విధిలిఖితం ఎవరు తప్పించగలరు మహర్షీ! వరాహక్షేత్రం వెళ్లి నివాసయోగ్యమైన భవనాన్ని నిర్మించుకొని ఆ వరాహక్షేత్రంమీదే వుండాలని నా సంకల్పం. ఆ క్షేత్రానికి వెళ్తూ దారిలో తమ దర్శనం చేసుకోవడం, మా దంపతుల మహద్భాగ్యంగా భావిస్తున్నాం. అంతేగాక

బహుదొడ్డత్యాగంతో లోకకల్యాణంకోసం దక్షిణదేశానికి తరలివచ్చిన తమరు మాకు హితంగా, సన్నిహితంగా తపోవనాన్ని ఏర్పాటు చేసుకోవడం మా పుణ్యఫలాన్ని ఎంత చెప్పుకొన్నా తక్కువే అవుతుంది. ఎందుచేతంటే



ఈ ఆశ్రమప్రాంతం అంతటా అడుగడుగునా అణువణువునా అద్భుతమైన అనిర్వచనీయమైన ఆధ్యాత్మికచైతన్యం ఉట్టిపడుతున్నది. మీ తపశ్శక్తి అమోఘం! జగత్కల్యాణకారకం! మహర్షీ! మేం వెళ్లివస్తాం. మాకు సెలవా మరి! అన్నాడు శ్రీనివాసుడు.

"స్వామీ! శ్రీనివాస పరంధామా! మాదొక విజ్ఞాపనం! మా ఈ అభ్యర్థన. మీకు తెలియని విషయం ఏమాత్రం కాదు. నెలకూడ దాటని నూతన కల్యాణదంపతులు మీరు. తీర్థయాత్ర గాని, పుణ్యక్షేత్రసందర్శనం గాని చెయ్యకూడదు. అది శాస్త్రనిషిద్ధం! అందువల్ల మీరు వరాహక్షేత్రప్రయాణాన్ని విరమించుకొని ఒక ఆరునెలలపాటు ఆశ్రమవాటికలో విడిది చెయ్యండి. మా ఆతిథ్యాన్ని స్వీకరించండి!

అందువల్ల కూడ, జగత్కల్యాణదంపతులైన మీ ఇరువురి దివ్య పాదపద్మాలు సోకిన మా తపోభూమి పరమపావన మవుతుంది. తాము నడయాడే ఈ సువర్ణముఖీ నదీ పరివాహక ప్రాంతం అంతా పవిత్రమైన దివ్యస్థలంగా విరాజిల్లుతూ ఇష్టార్థాలను ప్రసాదిస్తుంది." అంటూ అగస్త్యమహర్షి అనేకవిధాల ప్రార్థించాడు.

అవశ్యం మహర్షీ! లోకకల్యాణకారకమైన తమ అభ్యర్థనం మాకు శిరోధార్యం! జవదాటరానిది కూడ. అంతేకాక ఈ కలికాలంలో భక్తులే మాకు పరమావధి! ప్రధానంగా భక్త సంరక్షణమే మా ఈ అవతార లక్ష్యం కూడ.

అందువల్ల మీ అభ్యర్థన మాకు ఆనందదాయకం! అంటూ వెంటనే శ్రీనివాసుడు తొండమాను చక్రవర్తిని పిలిచాడు.

చక్రవర్తీ! మేము ఒక ఆరునెలలపాటు ఈ అగస్త్యాశ్రమ ప్రాంతంలో ఉండదలిచాం. అందువల్ల వేంకటాచలక్షేత్రంలో పుష్కరిణికి దక్షిణం దిక్కున వరాహస్వామి దానమిచ్చిన నూరు అడుగులమేర స్థలంలో శాస్త్రోక్తంగా

మాకోసం ఒక దివ్యభవనాన్ని నిర్మించు. కల్యాణ దంపతులమైన మేము అందులో గృహప్రవేశం చేస్తాం. పోయిరా అన్నాడు శ్రీనివాసుడు.

చిత్తం! అంటూ తొండమానుడు వరాహక్షేత్రానికి వెళ్లాడు.

ధన్యాతిధన్యులం శ్రీనివాసప్రభూ! కల్యాణ దంపతులైన మీరు మా కోరికను మన్నించడం మా భాగ్యం. మీ ఇరువురికోసం ఒక కుటీరాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయిస్తాం. ఈ ఆశ్రమంలో మీ అభీష్టానుసారం స్వేచ్ఛగా, ఆనందంగా విహరించండి! అంటూ నమస్కరించారు అగస్త్యముని దంపతులు.

అగస్త్యుడు సకల ఏర్పాట్లుతో అమర్చిన అందమైన కుటీరంలో ఆరునెలలపాటు పద్మావతీశ్రీనివాసులు ఆనందంగా సుఖంగా కాపురం చేశారు. పక్కనే ప్రవహిస్తున్న సువర్ణముఖీనదిలో జలక్రీడలాడారు. కుంభసంభవుడు ప్రతిష్ఠించిన శ్రీఆనందవల్లీ సమేత శ్రీ అగస్త్యేశ్వరుణ్ణి సేవించుకున్నారు. అక్కడ తోటల్లో విహరించారు. మునివాటికలను సందర్శించారు. అక్కడికి దగ్గర్లోనే ఆగ్నేయ దిక్కున వున్న తాతామనవళ్ల ఆశ్రమాలు–శుకమహర్షి ఆశ్రమాన్ని (శ్రీశుకపురం–తిరుచానూరు), పరాశరమహర్షి ఆశ్రమాన్ని (యోగిమల్లవరం) సందర్శించారు. అక్కడికి దగ్గర్లోని యోగులకొండల్లోని యోగులకు దర్శనమిచ్చారు. ఆ కొండకు పక్కనే అనృణ సరోవరంలో (అప్పలాయగుంట) ప్రసన్నవేంకటాచలపతిగా భక్తులను అనుగ్రహించారు.

ఆ కొత్తదంపతులకు ఆరునెలలకాలం అరక్షణం లాగా గడచిపోయింది.

పిదప దివ్యతపోమూర్తులైన లోపాముద్రా అగస్త్యదంపతులకు ప్రణామాలర్పించారు. వారు ఇచ్చిన ఆతిథ్యానికి, ఆదరణకు కృతజ్ఞతలు చెపుతూ ''మహర్షీ! నేను భూలోకంలో వున్నంతకాలం మీతో గడిపిన మధురసన్నివేశాలను భవిష్యత్తరాలవారు తలచుకుంటారు. మన ఇద్దరి కలయిక అపూర్వం! అప్రమేయం.



పుణ్యమూర్తులయిన మీ దంపతులు ఆదరించి ఆతిథ్యమిచ్చినందువల్లనే మేమిరువురం ఇక్కడ సుఖంగా ఉండగలిగాం. మీరు, మేము, నడయాడిన దివ్యభూమి ఈ తపోవనం. అందుకు గుర్తుగా తొందరలో ఈ ప్రాంతంలో "కల్యాణ వేంకటేశ్వరుడు" అనే పేరుతో అర్చామూర్తిగా దర్శనమిస్తాను. ఇక్కడ నన్ను దర్శించి ప్రార్థించిన వారికి కల్యాణ ప్రదములైన వరాలిస్తాను. వివాహం కావలె నన్న వారికి వివాహం, సంతానం, సౌభాగ్యం, గృహవసతి. ఆరోగ్యం, ఐశ్వర్యం.... ఇలా వారు వారు కోరిన కల్యాణ పరంపరలు ప్రసాదిస్తాను! అంటూ వరాలను అనుగ్రహించి, అగస్త్యమహర్షి దంపతులతో వీడ్కోలు పొంది అక్కడికి దగ్గరగావున్న సోపానమార్గంద్వారా వరాహక్షేత్రానికి బయలుదేరారు పద్మావతీశ్రీనివాసులు.

కాని ఇక్కడ ఒక్కమాట!

వివాహదీక్షితుడనయినందువల్ల. వివాహానంతరం పర్వతారోహణ చెయ్యకూడదన్నట్లు శ్రీనివాసుడు తానే సంకల్పించుకొన్నట్లుగా

**"పద్మావత్యనుగో దేవో బ్రహ్మరుద్రాదికైర్యుతః**
**సువర్ణముఖరీం ప్రాప్య తత్ర వాసమకల్పయత్.**
**షణ్మాసావధి లక్ష్మీశో "దీక్షితోఽహం మహామతే**
**న శైలమారోహ" మితి నిశ్చిత్య దేవరాట్**
**అగస్త్యభవనం గత్వా తత్ర వాసమకల్పయత్"**

–భవిష్యోత్తరపురాణం– అధ్యా–11.శ్లో–436–437

సువర్ణముఖరీనదీతీరంలోని అగస్త్యాశ్రమంలో ఆరునెలలపాటు వుండినట్లుగా భవిష్యోత్తరపురాణాంతర్గత వేంకటాచలమాహాత్మ్యం తెలుపుతోంది.

కాని శ్రీవేంకటేశ్వరుని ఆంతరంగిక భక్తురాలు మాతృశ్రీ తరిగొండవేంగమాంబ తన వేంకటాచలమాహత్మ్యగ్రంథంలో కొద్దిగా మార్పుచేసి, నూతనకల్యాణ దంపతులైన పద్మావతీశ్రీనివాసులు అగస్త్యమహర్షులవారి అభ్యర్థనమేరకు వారి ఆశ్రమంలో ఆరుమాసాల పాటు కాపురం చేసినట్లు ఇలాగ వర్ణించింది.

**"వ॥ .... అంత వేంకటేశ్వరుం డగస్త్యు నీక్షించి యిట్లనియె"**

**తే॥ 'సంయమీశ్వర ! వేంకటాచలముఁ జేర**
**మేము పోయదె' మని పల్కగా, మునీంద్రుఁ**
**డనియె 'షణ్మాస మహిగిరీంద్ర**
**మెక్కుదురె ! పెండ్లికొమరు లో యిందిరేశ !**

**క॥ అనఘా ! షణ్మాసంబులు**
**చను నంతకు నిచట నుండు సంతోషముగా**
**నన విని వేంకటగిరిపతి**
**తన సతితో నచట నుండెఁ దద్దయు వేడ్కన్**

– తరిగొండ వెంగమాంబగారి వేంకటాచలమాహాత్మ్యం ఆ-5, ప-245-247

శ్రీనివాసమంగాపురం ఆలయానికి ఉత్తరందిక్కున 6 కి.మీ. దూరంలో వున్న మెట్టునుండి మొదలుకొని తిరుమలవరకు గల మెట్లమార్గాన్ని "శ్రీవారిమెట్టు" లేదా "శ్రీపతిమెట్టు" అంటారు. ఆధ్యాత్మిక పురోగతికి తొలిమెట్టు ఈ శ్రీవారిమెట్టు! చంద్రగిరి వైపువున్న సోపానమార్గం కనుక "చంద్రగిరి సోపానమార్గం" అని కూడపిలువబడుతున్నది.

## శ్రీవారి మెట్టు

సాక్షాత్తు పద్మావతీశ్రీనివాసుల దివ్యపాదపద్మాలు సోకిన దివ్యమార్గమే, నడచివెళ్లిన పవిత్రమార్గమే ఈ శ్రీవారి మెట్టుమార్గం! వరాహస్వామి సన్నిధిలో



తొండమానుచక్రవర్తి నిర్మించిన ఆనందనిలయవిమానభవనంలో పద్మావతీ శ్రీనివాసులు ప్రవేశించి నిత్యకల్యాణ దంపతులుగా ప్రసిద్ధి చెందారు.

శ్రీవైకుంఠంనుండి నేరుగా భువికి దిగివచ్చిన శ్రీనివాసుడు తన తొలిపాదంమోపిన క్షేత్రం 'వేంకటాచలం' కాగా అక్కడినుంచి పలుమార్లు కొండదిగి వచ్చి నారాయణవన పరిసరాలకు వేటకు వెళ్లి పద్మావతిని మోహించి తిరిగివచ్చిన మార్గం శ్రీవారిమెట్టు మార్గం!

పద్మావతీ శ్రీనివాసులు నడచి వెళ్లిన 'శ్రీవారిమెట్టు' మార్గం ఆ తర్వాతి కాలంలో ఎందరో రాజులకు, యాత్రికులకు వేంకటాచల యాత్రకు వెళ్లే ప్రధాన రాజమార్గమయ్యింది.

నారాయణవనప్రభువులు, ఆకాశరాజు, తొండమానుడు మొదలుకొని విజయనగర ప్రభువులవరకు 'శ్రీవారిమెట్టు' మార్గాన్ని తమ యాత్రా మార్గంగా చేసుకున్నారు. విజయనగరప్రభువులు చంద్రగిరి కోటలో విడిది చేసిన సమయాల్లో తిరుమల శ్రీవారి నైవేద్య ఘంటానాదాన్ని అంచెలంచెలుగా ఉన్న ఘంటల ద్వారా విన్న తర్వాతనే భోజనానికి ఉపక్రమించేవారట!

శ్రీకృష్ణదేవరాయలు, అచ్యుతరాయలు వారి రాణులు గుర్రాలపైనా, మేనాలపైనా ఈ మార్గం ద్వారానే తిరుమలకు చేరుకొని శ్రీవారికి మొక్కులు చెల్లించుకునేవారు. సువర్ణముఖీ, కల్యాణీనదుల పరివాహక ప్రాంతంలో ఉన్న చంద్రగిరి, శ్రీనివాసమంగాపురం, కాళూరు, పేరూరు, పెరుమాళ్లపల్లె, మిట్టపాళెం, నరసింగాపురం మున్నగు గ్రామల్లోని పొలాలు ఇనాము భూములుగా వుండేవి. ఈ పొలాల్లో పండించిన వరిధాన్యం, పప్పుదినుసులు, కూరగాయలు అటు కొండపైన అనగా తిరుమలలోను, ఇటు శ్రీనివాసమంగాపురంలోను ఉపయోగించేవారు. శ్రీవారి వంటలకు, దీపాలకు ఆవునెయ్యి, ఆవుపాలు, పెరుగు మున్నగు పాడిద్రవ్యాలు కొండపైకి మాత్రం ఈ వస్తువులన్నీ తీసుకెళ్లడానికి మెట్టుమార్గమే ప్రధానరహదారి.

తిరుమల శ్రీవారి ఆలయంలో, అర్చనల్లో, సేవల్లో ఉత్సవాల్లో, వంశ పారంపర్యంగా సేవలందించే భక్తులుగా, ఆలయకవులుగా సముచిత స్థానాన్ని సంపాదించుకొని సత్కరింపబడిన తాళ్లపాక కవులు ముఖ్యంగా అన్నమయ్య మనమడు చిన్నన్న (చినతిరువెంగళనాథుడు) శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరాలయాన్ని జీర్ణోద్ధరణ చేశాడు. క్రీ.శ 1540 ప్రాంతంలో తాళ్లపాకవారికి సర్వమాన్యంగా సర్వహక్కులతో దానమివ్వబడింది.

అప్పట్లో అటు తిరుమల శ్రీవారి ఆలయాన్ని, ఇటు శ్రీనివాసమంగాపురంలోని ఆలయాన్ని పర్యవేక్షించిన తాళ్లపాక వంశీయులకు ఈ శ్రీవారి మెట్టు మార్గమే శరణ్యమయ్యింది. అప్పట్లో శ్రీవారిమెట్టు గుండా తిరుమలకు వెళ్లే యాత్రికులందరూ శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరుని తప్పక దర్శించిన తర్వాతే కొండకు వెళ్లేవారు.

శ్రీనివాసుడు శ్రీవైకుంఠం నుండి దిగివచ్చిన నాటినుండి శ్రీనివాసమంగాపుర క్షేత్రానికీ, తిరుమల క్షేత్రానికి ఇలా ఒక అవినాభావసంబంధం ఉంది.

ఇక్కడ గమనించవలసిన మరోవిశేషం కూడ ఉంది. అదేమంటే!

తిరుమల కొండమీది ఆ శ్రీనివాసప్రభువు, కొండక్రింది ఈ కల్యాణవేంకటప్రభువు ఇరువురూ ఒకే సరళరేఖపై తూర్పుముఖంగా స్థానక (నిలిచివున్న) మూర్తులై వక్షఃస్థల లక్ష్మితో నిల్చివున్నమూర్తులు - కాకపోతే ఒకరు కొండపైన-మరొకరు ఆ కొండకు ఆనుకొని, క్రింద సమతల ప్రదేశంలో. ఇంతే తేడా!

సప్తగిరులక్షేత్రం షట్చక్రయుతమైన యోగక్షేత్రం అనీ, సిద్ధక్షేత్రం అనీ, సాధనాక్షేత్రం అనీ ప్రసిద్ధి! మూలాధారచక్రంవలె భాసిస్తూ ఉన్న శ్రీనివాసమంగాపురం శ్రీపద్మావతీ శ్రీనివాసులు ఇరువురూ చెట్టాపట్టాలేసు కొని సంచరించిన దివ్యస్థలం! కాగా సప్తగిరులశిఖరాగ్రాన ఆ దివ్య



దంపతులిద్దరూ ఒక్కరై, ఏకమై మమేకమై అనంతమైన, ఆనందమయమైన ఒకే తత్త్వంగా సహస్రారచక్రంలోవలె వెలుగులీనుతున్న దివ్యక్షేత్రం వేంకటాచలం!

తదుపరి కాలంలో శ్రీనివాసమంగాపురంలో కల్యాణవేంకటేశ్వరుడు ఎప్పుడు అర్చామూర్తిగా వెలిశాడో, ఎలా వెలిశాడో చెప్పడం సాధ్యం కాదు. శ్రీనివాసుడు అర్చామూర్తిగా లేని పూర్వకాలంలో ఈ గ్రామం "సిద్ధకూటం" అని పిలువబడేది. ఆ గ్రామంలో ఎందరో సిద్ధులు, ఆధ్యాత్మికవేత్తలైన ఉపాసకులు వుండేవాళ్లు.

క్రీస్తుశకం 1433 నాటికి ఈ గ్రామం, ఈ గుడి ఎంతో ఉచ్చస్థితిలో వుండేవనీ, 22-11-1433 నాటి శాసనం తెలియజేస్తోంది. అప్పట్లో సిద్ధకుట్టి, సిద్ధకూటం... శ్రీనివాసపురం.... శ్రీనివాసమంగాపురం ఇలా కాలాంతరంలో పిలువబడిన ఈ గ్రామంలో ఎందరో వేదవేత్తలయిన పండితులు, మంత్రవేత్తలు, అనుష్ఠానపరులయిన వైదికశ్రేష్ఠులు అనేకమంది ఉండే వారట. అందువల్లే ఈ గ్రామం చిన్నదైనా ప్రసిద్ధమైన అగ్రహారంగా పేరొందింది. ఈ చిన్న పల్లెలోనే 24 మంది ప్రముఖులయిన 'మహాజనం' వుండేవారట. మహాజనం అనగా ఘనాపాఠులయిన చతుర్వేద పండితులు అని అర్థం.వాళ్లలో నెలకు ఇద్దరువంతున ఈ పల్లెనుండి తిరుమల శ్రీవారి ఆలయానికి వెళ్లి శ్రీవారి సన్నిధిలో వేదపారాయణం చేసేవారని చెప్పబడింది.

సువర్ణముఖీ-కల్యాణీ-భీమానదుల త్రివేణీ సంగమతీర్థంలోని సస్యశ్యామలమైన పొలాలు, అగ్రహారం, చుట్టుపక్కలవున్న చిన్నచిన్న పల్లెలు. ఇలా అన్నీ తర్వాతికాలంలో ఉద్ధృతమైన వరదతాకిళ్లకు లోనై కొట్టుకపోయాయి.

మళ్లీ సుమారు వంద సంవత్సరాలకు దినదినాభివృద్ధిచెందిన ఈ గ్రామాన్ని క్రీస్తుశకం 1540 ప్రాంతంలో విజయనగర సామ్రాజ్యచక్రవర్తి

అచ్యుతదేవరాయలు ఈ శ్రీనివాసపురాన్ని "సర్వమాన్యఅగ్రహారం"గా తాళ్లపాక కవులకు దానమిచ్చాడు.

ఆ సమయంలోనే తాళ్లపాక అన్నమాచార్యుల మనవడు పెద్ద తిరుమాలాచార్యుల పుత్రుడైన చిన్నన్న అని పిలువబడుతున్న చిన తిరువెంగళనాథుడు శ్రీనివాసమంగాపుర దేవాలయాన్ని సర్వశోభాయమానంగా జీర్ణోద్ధరణ చేశాడు. శిథిలమైన విగ్రహాలను తొలగించి నూతన విగ్రహాలను ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా అర్చనాదులు, ఉత్సవాదులు నిర్వహింపబడేట్లుగా ఏర్పాటు చేశాడు.

తనకు శిష్యప్రాయులైన పద్మసాలె భక్తులు గురుదక్షిణగా 10వేల వరహాలను 'పాదకానుక'గా అనగా గురుదక్షిణగా చెల్లించారు. చిన్నన్న వారిచ్చిన 10 వేలకు మరి 10 వేలవరహాలను తనధనాన్ని కలిపి మొత్తం 20 వేల వరహాలతో శ్రీనివాసమంగాపురం దేవాలయాన్ని సముద్ధరించారు.

పద్మసాలె కులస్థులు గురువైన చిన్నన్నకు 10 వేల వరహాలను గురుదక్షిణగా సమర్పించారని విన్నాం కదా! అందుకు కారణమైన ఒక అద్భుత సంఘటన శ్రీనివాసమంగాపుర ఆలయ చరిత్రలోనే ప్రధానాంశంగా నిలిచిందని చెప్పవచ్చు.

ఆసక్తికరమైన ఆ సన్నివేశం వివరాల్లోకి వెళితే ఆశ్చర్యం కలుగుతుంది.

## అలమేలుమంగ సాక్ష్యం!

అప్పట్లో పద్మసాలెవారు, జాండ్రవారు ఇద్దరూ తగాదాపడ్డారు. తిరుచానూరు అలమేలుమంగమ్మ తమ ఇంటి ఆడపడుచు అనీ, కాదు కాదు మా ఇంటి ఆడపిల్ల అనీ ఇద్దరూ వాదులాడుకున్నారు. విచిత్రం ఏమంటే పద్మసాలెవారు, జాండ్రవారు ఒకే వంశంవారేగాక ఇద్దరూ చేనేతవృత్తి వున్నవారే. ఇద్దరికీ కులదేవత నందవరం చౌడేశ్వరీ అమ్మవారు. ఇద్దరికీ



ఇచ్చిపుచ్చు కోవడాలు వున్నాయికూడా. కాని పద్మసాలెవారు ఒకింత వైష్ణవమతాభిమానులు. జాండ్రవారికి శైవమతమంటె ఇష్టం. అంతే తేడా. ఈ భేదమే ఎక్కువై చిలికి చిలికి గాలివానవరకు వచ్చింది.

ప్రధానంగా తిరుపతి తిరుచానూరు, మల్లవరం, నారాయణవరం మున్నగు ప్రాంతాల్లో వ్యాపించి, చేనేతవృత్తిని సాగించుకుంటున్న ఈ తెగలమధ్య 15వ శతాబ్దంలో ఒక కొత్తవివాదం చెలరేగింది.

అదే! సాక్షాత్‌లక్ష్మీ స్వరూపురాలైన అలమేలుమంగమ్మ తమ ఆడబడుచు అని. తమ తగాదా తీర్చవలసిందని తాళ్లపాక చిన్నన్నను ప్రార్థించారు.

అలా వారిరువురూ చిన్నన్నను ప్రార్థించడానికి ప్రధానమైన కారణాలు చాలావున్నాయి.

అందులో తమ కులదేవత అయిన చౌడేశ్వరీ దేవే తాళ్లపాక చిన్నన్నకు కూడ కులదేవత! అందువల్ల తమ కులగురువు. అంతేగాక చిన్నప్పుడే చిన్నన్నకు అలమేలుమంగమ్మ తన చనుబాలు తాపిందట! ఆయన పిలిచినప్పుడంతా అలమేలమంగమ్మ పలికేదని ప్రఖ్యాతివున్నందువల్ల చిన్నన్నను తమ గురువుగా ఎంచుకున్నారు. తమ తగవు తీర్చవలసిందని ప్రార్థించారు. 23-10-1541 వ తేదీ గురువారం కార్తీకపున్నమినాడు మధ్యాహ్నం 12 గంటలకు చిన్నన్న అలమేలుమంగమ్మచేత సాక్ష్యం పలికించినాడు. పద్మసాలెవారి ఇంటి ఆడపడుచుననీ, వారి చీరసారె పసుపుకుంకుమలు ముందుగా పద్మసాలెవారు సమర్పించిన తర్వాతనే ఎవరైనా సమర్పించ వచ్చును అని సాక్ష్యం పలికింది. అందుకు కృతజ్ఞతగా పద్మసాలీలు 10 వేల వరహాల పాదకానుకను గురువైన చిన్నన్నకు సమర్పించారు.

చిన్నన్న వారిచ్చిన 10 వేల వరహాల గురుదక్షిణకు మరి 10 వేల వరహాలను చేర్చి మొత్తం 20 వేల వరహాలతో చంద్రగిరికి దగ్గరవున్న

''ఆళ్లగట్టు'' అనే రాతిగనిని కొన్నాడు. అందులోని రాళ్లతో శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణవేంకటేశ్వరాలయాన్ని జీర్ణోద్ధరణ చేశాడు. ఆనాటినుండి తాళ్లపాకవారి సొంత ఆలయంగానే ఈ గుడి పరిగణింపబడిందని చెప్పవచ్చు.

సర్వహక్కులతో తాళ్లపాకవారి అధీనంలోవున్న ఈ ఆలయ మహాద్వార ప్రవేశంలో ఇరువైపులా రాతి అధిష్ఠానంమీద చిన్నన్న చెక్కించిన తన తాత తండ్రుల శిల్పాలు- అనగా అన్నమయ్య-తిరుమలయ్యల శిల్పాల్ని మనం చూడవచ్చు. వీటితో పాటు ఆలయంలోని ముఖ మండపంలో ఒక స్తంభంమీద అన్నమాచార్యుల శిల్పాన్ని చెక్కించాడు.

ముఖమండపంలో శ్రీస్వామివారికి ఎదురుగా నిలిచి వున్నప్పుడు జయవిజయుల ద్వారప్రవేశం నుండి ఎడమవైపున వున్న మూడవస్తంభం క్రిందిభాగంలో అన్నమయ్య శిల్పం ఉంది. కుడిచేత్తో దండెను మీటుతూ. ఎడమ చేతితో ద్వారంలోపలవున్న స్వామివారి మూలమూర్తిని చూపుతున్నట్లున్న అన్నమయ్య శిల్పం చెక్కబడింది.

ఇలాగ సర్వమాన్య అగ్రహారంగా సర్వహక్కులతో వున్న శ్రీనివాసమంగాపురగ్రామంలో, పూర్తిగా తాళ్లపాకవారి అధీనంలో వున్న శ్రీకల్యాణ వేంకటేశ్వరుని ఆలయం పూర్వపు పునర్వైభవాన్ని సంతరించుకొంది. మళ్లీ ఉత్సవాలతో వైభవంగా వందల ఏళ్లపాటు నిరాఘాటంగా తిరుమలస్వామివారికి దీటుగా సాటిగా శ్రీనివాసమంగాపురకల్యాణ వేంకటేశ్వరునిఆలయం ఆధ్యాత్మిక వినీలాకాశంలో ప్రకాశించింది.

కాని మానవుని చేతిలో ఎంతమాత్రం లేని ప్రకృతి యొక్క నిరంకుశ వైపరీత్యాలకు, బీభత్సాలకు అడ్డూ ఆపూ లేకుండా పోయింది. వికల్యా(కల్యాణి) నది వికృతమైన వరదలకు కల్యాణ శ్రీనివాసుని గుడి మరోమారు వికలమయింది. శిథిలమయింది. దీనికి తోడు "గోరుచుట్ట మీద రోకటి పోటు" అన్నట్లుగా తురకల దండయాత్రకు లోనై కొన్ని విగ్రహాలు ఛిద్రమయ్యాయి. మరికొన్ని విగ్రహాలు కదలి పోయినాయి. ఇలా ఎన్ని ఉపద్రవాలు సంభవించినా, చిన్న చిన్న విగ్రహాలు కదలిపోయినా, సుమారు 10 అడుగుల ఎత్తువున్న రాతి అధిష్ఠానంపై నిర్మింపబడిన ఈ ఆలయంమాత్రం చెక్కు చెదరలేదు.



గర్భాలయంలో కూడ సుమారు 10 అడుగుల ఎత్తు ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరుని మూలమూర్తి మాత్రం భద్రంగానే ఉండింది. కాక పోతే వందల ఏళ్ల కొద్దీ వరదనీటిలో, బురదమట్టిలో కూరుకపోయి, చివరకు చెట్లు చేమలు, పుట్టలతో నిండిన ఆలయం "నివురు గప్పిన నిప్పు", వలె అంతస్తేజంతో స్తబ్ధంగా నిలిచివుండింది.

శ్రీనివాసుడు శ్రీవైకుంఠంనుంచి వచ్చిన తొలినాళ్లలో పుట్టలో దాగివున్నట్లుగానే, ఈ కల్యాణ శ్రీనివాసుడు కూడ కొంతకాలంపాటు పుట్టల్లో చెట్లలో దాగివుండాలని ఇష్టపడ్డాడేమో!

అలా కొంతకాలం నిర్మానుష్యమై నిశ్శబ్ద గంభీరవాతావరణంలో పుట్టనుండి ఎప్పుడెప్పుడా బయటపడి మళ్లీ ఉత్సవాలతో, ఊరేగింపులతో పునర్వైభవాన్ని సంతరించు కోవాలన్న తపనతో ఎవరికోసమో ఎదురు తెన్నులు చూస్తున్నట్లుగా శ్రీనివాసమంగాపుర ఆలయం నిలిచివుండింది.

కొన్ని వందల ఏండ్ల తర్వాత సుమారు క్రీస్తుశకం 1900 సంవత్సరాల ప్రాంతంలో శ్రీనివాసమంగాపురంలో పొదలమాటున పుట్టల్లో దాగుకొని యోగ సమాధిలో వున్న కల్యాణ శ్రీనివాసునిలో చైతన్యవంతమయిన ఒక కదలిక వచ్చింది.

ఎప్పుడో ఏనాడో తిరుమలలో పుట్టనుండి బయటకొచ్చిన శ్రీనివాసునికి వకుళమాత (యశోద) సపర్యలు చేసింది.

మరి ఈనాడొ! ఇప్పుడొ! శ్రీనివాసమంగాపురంలో పుట్టనుండి బయటపడిన శ్రీనివాసునికి సేవలందించడానికి మరో వకుళమాత ప్రత్యక్షమయ్యింది. ఈమె చరిత్రకెక్కని వకుళమాత! ఆమె పేరు 'తాయారమ్మ!'

ఆమె విచిత్ర గాథ ఏమిటో! వింతగాథ ఏమిటో! అప్పటి ''వకుళమాత''లాగా వివరంగా తెలియకపోయినా ఇప్పటి ఈ "తాయారమ్మ"ను గూర్చి తెలిసినంతవరకు చెప్పుకుందాం!

## వెంకన్న సేవలో వెర్రి బాగులమ్మ!

శ్రీనివాసమంగాపురంలో ఒక రోజున ఉన్నపళంగా ఒక వెర్రి బాగులస్త్రీ ప్రత్యక్షమయింది. ఆమె ఎక్కడి నుండి వచ్చిందో తెలియదు. ఏ ఊరినుంచి వచ్చిందో తెలియదు.

పిచ్చిదానిలాగా చూపులుచూస్తూ వెర్రి నవ్వు నవ్వుతూ వుండేది. చూపులు బయటికి చూస్తున్నా అంతర్లీనంగా ఎక్కడో చూస్తున్నట్లు, ఎవరితోనో మాట్లాడుతున్నట్లుగా తనలో తానే గొణిగేది. అలా గొణుక్కుంటునే వెర్రినవ్వులు నవ్వేది. గట్టిగా మాత్రం కాదు. చిరునవ్వు, నవ్వేది. పక్కన ఎవరున్నా గమనించేది కాదు. ఎవరేమన్నా పట్టించుకొనేది కాదు. ఆ నవ్వు మొగంతో ఆతల్లి ఆకర్షణీయంగా కనపడుతుండేది. చెరగని నవ్వుతోవున్న ఆమె శరీరం ముడతలు పడ్డా, పసుపుపచ్చని నిమ్మపండులాగా నిగనిగలాడుతూ నుదుటున గుండ్రని కుంకుమబొట్టుతో చేతులనిండా మట్టిగాజులతో పెద్దముత్తైదువులాగా, యోగినిలాగా కనబడేది. మితంగా మాట్లాడేది. మితంగా ఏదో అడిగేది. వెంటనే నవ్వేది. ఇంతే

ఒక ఉన్మాదస్థితిలో, అవధూతలాగా, యోగినిలాగా వున్న ఆమెను మాత్రం ఆ ఊరివాళ్లు ఏవేవో ప్రశ్నలు అడిగే వాళ్లు. కొందరు ఎక్కడి నుండి వచ్చావు! అని అడిగేవాళ్లు. మరి కొందరు ఏం పేరు? మీరు



బ్రాహ్మణులా? ఇలా ఎన్ని ప్రశ్నలు గుచ్చి గుచ్చి అడిగినా నవ్వడమే ఆమె జవాబు.

పాపం! బ్రాహ్మణ స్త్రీ అయివుండవచ్చు. ఎక్కడి నుంచి వచ్చిందో? ఎవరికెరుక అనుకునేవాళ్లు. ఆ తర్వాత ఆ తర్వాత ఆమెను పట్టించుకోవడం పూర్తిగా మానివేశారు. కాని ఆమెను ఆ ఊళ్లో అందరూ "తాయారమ్మ" అని పిలిచేవాళ్లు.

పుట్టలతో చెట్లతో నిండిన శ్రీనివాసఆలయమే తాయారమ్మ నివాసం! ఆమె ఊళ్లోని ఇంటింటికి వెళుతుంది. రవ్వంత చమురు ఇయ్యరూ స్వామికి దీపం పెట్టాల అని అడుగుతుంది. కొందరు డబ్బులియ్యబోతే నాకెందుకూ కాసులు. కొంచం బియ్యం పప్పు పెట్టండి! అని అడిగి ఇప్పించుకుంటుంది.

కొందరు ఏమిచ్చినా తీసుకొనేది కాదు. కొంతమందిదగ్గర పదేపదే అడిగి తీసుకుంటుంది.

ఇలా ఇంటింటికి వెళ్ళి పప్పు, ఉప్పు, బియ్యం, నూనె .... ఇలా వస్తువుల్ని సేకరించి గుడికి వచ్చి మూడురాళ్ల పొయ్యి పెట్టి, మట్టి కుండలో అన్నీ కలియకలిపి ఉడికేసేది.

ఆ తర్వాత మట్టిమూకుట్లో నూనె పోసి వత్తి వెలిగించి గుళ్లో దీపం వెలిగిస్తుంది.

కటికచీకట్లో గాఢాంధకారంలో తాటిమట్టల్ని వెలిగించి దాని మంటల వెలుగుల్లో గుడిలోకి వెళ్ళేది. దారిలో పుట్టల్లోని పాములు చిన్నవీ పెద్దవీ 'బుస్' అంటూ బుసకోట్టేవి. పడగ విప్పేవి. ఇవేవీ పట్టించుకోకుండా తాయారమ్మ

''ఒరే నాగా! ఒరే శేషూ! స్వామికి ఆకలేస్తుందంట! పక్కకు తప్పుకొండర్రా! జరగండర్రా" అంటూ ముద్దుగా మురిపెంగా ప్రేమగా

పిలుస్తూ ఏమాత్రం జంకుగొంకు లేకుండా లోనికి వెళ్లి స్వామివారిని అందినంతవరకు తుడిచి, తెచ్చిన పూలను పాదాలపై సమర్పించేది. తదుపరి మట్టి మూకుట్లో దీపారాధన చేసి, తానువండిన మట్టికుండ అన్నాన్ని నిండుగా అట్లాగే స్వామికి నివేదించి సమర్పించేది. అంతే ఆమె భక్తి! లోపల ఏదేదో గొణిగేది. అవి ఏం మాటలో ఏం మంత్రాలో ఎవరికీ తెలియదు. ఆమెకే తెలియాల. ఆ స్వామికే తెలియాల. అంతే!

నైవేద్యం అయినవెంటనే ఆ ప్రసాదాన్ని అక్కడ ఆ గుడి ఆవరణలోవున్న పసులకాపరులకు పంచి పెడుతుంది. మిగతా తాను ఆరగిస్తుంది. ఒక్కొక్కసారి పసులకాపరులను అడిగి ఆవుపాలను స్వామికి నివేదించి అక్కడ గుళ్లో వుండే సర్పాలకు కూడా మూకుళ్లలో పెడుతూ ఒరే నాగులూ! పాలు తాగండర్రా! మీకోసమే! అంటూ పాలుపెట్టేది ఆ తల్లి! ఆ పాములు కూడా ఒదిగి ఒదిగి ఆమె చెప్పినట్లుగానే ఆమె పెట్టిన పాలను తాగేవి.

ప్రతిరోజు 'లేవడం, ఊళ్లో బిచ్చమెత్తడం. వాటిని వండి స్వామికి సమర్పించడం!... ఇదే ఆమె నిత్యకృత్యం, రామనామం!

శ్రీనివాసుని గుడే ఆమె నివాసం! పగలంతా అక్కడ గుళ్లో మేసే ఆవులు, మేకలు, బర్రెలు, గొర్రెలు.... వాటిని మేపే పసులకాపరులు... వాళ్లే ఆమెకు నేస్తాలు!

ఇక రాత్రివేళల్లో! అయితే అక్కడి పుట్టల్లోని పాములే ఆమె దోస్తులు!

ఆమెకు నిరంతరం స్వామిమీదే ధ్యాస! స్వామి ఊసే ఆమెకు ఊపిరి. మరోమాట లేదు మంతీ లేదు. ఇలా సుమారు 40 ఏండ్లు జరిగింది.

ఒక రోజున తాయారమ్మ తాను నిత్యం భిక్షకు వెళ్లే ప్రతి ఇంటింటికీ వెళ్లింది. ఆ ఇంటి వాళ్లందర్నీ ఆప్యాయంగా పిలిచి చెప్పింది.



ఈ రోజుతో నాపూజలు సరి! ఇక రేపట్నించీ నేను భిక్షకు రాను. "రేపు ఒక స్వాములోరు వస్తారంట! ఆయన బాగా మంత్రాలతో పూజ చేస్తారంట! ఇప్పట్నుంచి ఈ గుడి వృద్ధిలోకి వస్తుందంట!"

ఈ విషయాలన్నీ గుళ్లోని శ్రీనివాసుడే నాకు చెప్పినాడు! "ఈ రోజే నేను తిరుమల వెంకన్న దగ్గరికి వెళ్తాను. అక్కడినుండి తుంబురు కోనకు (తిరుమలకొండ మీది తీర్థం) పోయి జపం చేసుకుంటాను"– అంటూ ఇంటింటి దగ్గరే కాదు. కనపడిన ప్రతి వాళ్లందరికీ చెప్పింది. పిల్లా, పెద్దా, ఆడా, మగా ఇలా ఆ ఊళ్లోని అందరికీ చెప్పింది. ఆవుపాలు ఇచ్చిన పసుల కాపర్లందరికీ ఇదే మాటల్ని చెప్పింది. పోయివస్తానంటూ. ఆమె చెప్పేమాటల్ని విన్న వాళ్లందరూ ఎదో తెలియని వెలితికి లోనయ్యారు.

ఇది రోజూవున్న సణుగుడేలే! అనుకున్నారు కొందరు.

గుళ్లోని స్వామికీ నమస్కరించింది! పుట్టల్లోని పాములకు నమస్కరించి వీడ్కోలు చెప్పింది. అక్కడవున్న చెట్లను, తీగలను ప్రేమగా స్పృశించి, వీడ్కోలు చెప్పి రాత్రికి రాత్రే ఎటో వెళ్లిపోయింది వెర్రిబాగులతల్లి తాయారమ్మ!

కాదు కాదు పరమయోగిని, భక్తురాలు తాయారమ్మ! ఇంకెక్కడికి పోయుంటుంది? తిరుమల వెంకన్న దగ్గరికి తప్ప!

విచిత్రాతి విచిత్రం! భక్తురాలు, కర్మయోగిని తాయారమ్మ చెప్పినట్లుగానే ఆ మరునాడే కంచినుంచి 'సుందరరాజ స్వామి' అనే భక్తుడు అతి ప్రయాసతో మారుమూలగా వున్న శ్రీనివాసమంగాపురాన్ని వెతుక్కుంటూ వచ్చాడు.

తిరుమల వెంకన్న చేసే విచిత్రాలు ఎన్నెన్నో! ఎవరికెరుక!

ఈ శ్రీనివాసపురంలోని కల్యాణవెంకన్నను వెదుక్కుంటూ భక్తుడు సుందరరాజస్వామి ఎందుకు వచ్చాడు? ఆయన గాథ ఏమిటో? వినండి మరి! వీనుల విందుగా విని తరించండి.

## అర్చకులు శ్రీసుందరరాజస్వామి

మోక్షదాయకమైన ఏడు మహా దివ్యక్షేత్రాల్లో కాంచీనగరం అద్వితీయమైన పుణ్యస్థలం! అష్టాదశ శక్తి పీఠాల్లో కామకోటి పీఠస్థురాలుగా దర్శనమిస్తున్న జగన్మాత అమ్మలగన్న అమ్మ కంచిలోని శ్రీకామాక్షమ్మ!


అనేక దేవాలయాల నగరంగా, దివ్యక్షేత్రాల నగరంగా పేరొందిన కాంచీపురంలో కౌశికగోత్రానికి చెందిన ఒక బ్రాహ్మణోత్తముడు ఉండేవారు. వారు మహారాష్ట్ర మాధ్వబ్రాహ్మణ శాఖకు చెందిన పరమ భక్తులు. వారి పూర్తి పేరు "అర్చకం కంచి రాఘవేంద్రాచార్య సుందర రాజస్వామి. వీరి తండ్రి పేరు రాఘవేంద్రాచార్యులు. పరమ నిష్ఠాగరిష్ఠులు భక్తుడైన సుందరరాజస్వామి తన ధర్మపత్ని మీనమ్మ (మీనాక్షమ్మ)తో కలిసి శ్రీనివాసమంగాపురం చేరుకున్నారు!

కంచినుండి అలా ఆసక్తితో ఆర్ద్రంగా వెతుక్కుంటూ శ్రీసుందరరాజస్వామి అంతవరకు తాను చూడని, కనీసం విననైనా వినని శ్రీనివాసమంగాపుర క్షేత్రానికి అతి ప్రయాసతో రావడానికి అద్భుతమైన ఒక కారణం చోటు చేసుకుంది.

సుందరరాజస్వామికి చాలమార్లు శ్రీనివాసమంగాపురంలోని కల్యాణవేంకటేశ్వరుడు కలలో కనపడేవాడు. కనపడడమే కాకుండా "నీవు నాదగ్గరికి రా. నేను చీకట్లో వున్నా. చెట్లల్లో పుట్టల్లో వున్నాను. నీవు వచ్చి నన్ను ఉద్ధరించి పూజలు చెయ్యి. సేవలు చెయ్యి." అంటూ స్వప్నంలో ఆదేశించేవాడు. అదే కలలో ఒక శిథిలాలయం కనపడేది!

ఒకసారి కాదు. రెండుమార్లు కాదు. ఆ విప్రుడు నిద్రపోతే చాలు. కనపడేవాడు కల్యాణ వెంకన్న. ఏ ఊళ్లో వున్నావయ్యా స్వామీ! నీవు. ఎక్కడని నిన్ను వెతికేది? అంటూ ప్రార్థించేవాడు సుందరరాజస్వామి.

నీవు వెంటనే వేంకటాచల యాత్ర చెయ్యి. నీకు దారి తెలుస్తుంది. అంతేకాదు. అతి దగ్గరలో రాబోతున్న ఆషాఢ శుద్ధ సప్తమినాడు నాకు



**శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి**
**శ్రీ నివాస మంగాపురం**
**(1970)**



**శ్రీ అర్చకం కంచి రాఘవేంద్రాచార్య సుందరరాజస్వామివారు అర్చకులు**



పూజ చెయ్యాలి అంటూ మళ్లీ స్వప్నంలోనే ప్రేరేపించాడు కల్యాణ వేంకటేశ్వరస్వామి.

ఇక తాళలేక తిరుమలయాత్రకు బయలుదేరినాడు సుందరయ్య. దారిలో కనపడిన ప్రతి ఊళ్లోవాళ్లని అడిగేవాడు. ఈ ఊళ్లో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉన్నాడా? ఆలయం వుందా? అని ... ఇలా దారిలో విచారించుకుంటూ సుమారు 15 రోజులకు శ్రీనివాసమంగాపురం చేరుకున్నాడు. అక్కడివాళ్లను విచారించాడు. ఆ ఊరివాళ్లు చెప్పారు. ఈ ఊరి బయట పాడుబడిన ఒక ఆలయం ఉంది. అందులోని దేవుడి పేరు "కల్యాణ వేంకటేశ్వరస్వామి" అని విన్నాం. ఇంకా వింటూనే వున్నాం. కాని ఆగుళ్లో పుట్టలు పెరిగాయి. చెట్లు చేమలు పెరిగాయి. నిన్నటి మొన్నటివరకు భక్తురాలైన ఒక వైష్ణవ స్త్రీ ఆ స్వామివారిముందు దీపం పెట్టేది. తన అన్నాన్ని నివేదించేది. అని ఆ గ్రామస్థులు చెప్పారు.

వెంటనే ఆనందపడ్డాడు ఆ బ్రాహ్మణస్వామి. ఆ రాత్రి అక్కడే ఆ ఊళ్లోనే విడిది చేశాడు. ఆ రాత్రి స్వప్నంలో కూడా ప్రత్యక్షమయ్యాడు కల్యాణవేంకటేశ్వరుడు. ఇదే నయ్యా నేనున్న ఊరు. ఈ ఊళ్లోనే పుట్టలమధ్య చీకట్లో వున్నాను. ఇంక ఆలస్యం చెయ్యకు. అంటూ ముహూర్త వేళను కూడ స్వామివారే నిర్దేశించాడు.

మేల్కొన్న సుందరరాజస్వామి ఆశ్చర్యపోయాడు. ఆనందపడ్డాడు. తన స్వప్న వృత్తాంతాన్ని ఆగ్రామ పెద్దలకు ప్రజలందరికీ తెలియజేశాడు. సాక్షాత్తు శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరుడే నన్ను ప్రేరేపించి కంచిక్షేత్రంనుండి ఇక్కడకు రప్పించు కొన్నాడు. అందరం కలిసికట్టుగా ఈ ఆలయాన్ని ఉద్ధరించుకుందాం అని ఆదేశించినాడు.

అంతే! దైవ ప్రేరణతో ఆ ఊళ్లో అందరికీ ఒక కొత్త ఉత్సాహం వచ్చింది. ఒక ఉత్తేజం ఆవరించింది. తలా ఒక చెయ్యి వేశారు. పుట్టల్ని తొలగించారు.

చెట్లను తొలగించారు. ఆలయాన్ని నీళ్లతో కడిగి ఆలయం ఆవరణం అంతా శుభ్రం చేశారు.

ఆలయం ఆవరణంలో ఆవుపేడతో కళ్లాపు చల్లి ముగ్గులు వేశారు. మామిడాకు తోరణాలతో అలంకరించారు. ఆ మరునాడే సాక్షాత్తు కల్యాణవేంకటేశ్వరస్వామివారు నిర్ణయించిన శుభముహూర్తం!

అది విక్రమనామ సంవత్సరం, ఆషాఢ శుద్ధసప్తమి ఉత్తరఫల్గునీ నక్షత్రం కూడిన శుభావహమైన రోజు. అనగా 11-7-1940 కూడిన రోజు. మళ్లీ వందల సంవత్సరాల తర్వాత శాస్త్రోక్తంగా అర్చకులైన శ్రీసుందర రాజస్వామివారి చేతులమీదుగా శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామికి తొలిపూజ జరిగిన రోజు!

ఆ రోజు ఆలయంలో లఘువుగా సంప్రోక్షణ నిర్వహింపబడింది. తర్వాత శ్రీవారి గర్భాలయం ముంగిట సుప్రభాతాన్ని పఠిస్తూ వందల సంవత్సరాల పాటు యోగ సమాధిలో వున్న స్వామి వారిని మేల్కొల్పడం జరిగింది. తర్వాత శ్రీ సూక్త, పురుషసూక్త భూసూక్తాల పఠనంతో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికి ఆవుపాలు, పెరుగు మున్నగు అభిషేకద్రవ్యాలతో మంగళాభిషేకం నిర్వహింపబడింది. పిదప సన్నని బంగారుజరీ అంచువున్న తెల్లని పట్టు పంచెను, ఉత్తరీయాన్ని స్వామివారికి అలంకరించారు. నొసట్లో తెల్లని పట్టెనామాలు తీర్చిదిద్దారు. పూలమాలలు స్వామివారి నిలువెత్తు మూర్తికి అందంగా అలంకరింపబడ్డాయి. ఆ తర్వాత సహస్రనామార్చనలతో ధూప దీపనైవేద్యాలు ఘనంగా నిర్వహింపబడ్డాయి.

ఈ వేడుకల్లో ఆ గ్రామం ప్రజలేకాక చుట్టుపక్కలవున్న పల్లెలప్రజలు పాల్గొన్నారు. ఆ ఊళ్లో అందరి ఇళ్లలోను ఆ రోజు పండుగ చేసుకున్నారు. కల్యాణ శ్రీనివాసుని చరిత్రలోనే ఆ రోజు ఒక అద్భుతఘట్టం చోటుచేసుకుంది.



**శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారు ఉత్సవమూర్తులు.**



**శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం**
**1950 సంవత్సరం**



ఇదిగో! ఆనాడు 1940 జూలై 11వ తేదీ నాటి నుండి ప్రతిఏటా ఆషాఢశుద్ధ శుద్ధసప్తమినాడు "సాక్షాత్కార వైభవం" పేరుతో ఘనంగా శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరునికి ఒక్క రోజు ఉత్సవం జరుపబడుతుండేది.

కాని తి.తి.దేవస్థానం 1980 నుంచి ప్రతి ఏటా "సాక్షాత్కార వైభవోత్సవం' పేరిట 3 రోజుల పాటు వార్షిక ఉత్సవాలు నిర్వహిస్తున్నది.

ఆనాటి (1940-7-11) నుండి శ్రీసుందరరాజస్వామి అర్చకత్వంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ రోజుకొక వైభవంగా, వైభోగంగా విలసిల్లింది.

ఆలయంలో పూజలు నిర్వహించడానికి, అభివృద్ధి చెయ్యడానికి అర్చకులు నానాప్రయాసలు పడ్డారు. ఇంటింటికి తిరిగి చందాలు వసూలు చేసేవారు. పప్పు బియ్యం వగైరా విరాళాలుగా స్వీకరించేవారు. ఆదాయంకోసం శ్రీనివాసమంగాపురం గ్రామస్థులు "వీధినాటకాలు" జరిపి, టికెట్లు అమ్మేవారు. ఇలా చాల ఏండ్లు జరిగింది. అటు తర్వాత అర్చకులు సుందరరాజస్వామి, గ్రామపెద్దలు కలిసి తి.తి.దేవస్థానంవారిని సహాయం చెయ్యమని అర్థించారు. చివరకు వారి కృషి ఫలించింది.

## తి.తి.దేవస్థానం వారి ఆలయాల్లో విలీనం

1967 వ సంవత్సరం ఏప్రిల్ 26వ తేదీన తి.తి.దేవస్థానం నారాయణవనంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం, నాగులాపురంలోని శ్రీవేదనారాయణస్వామి ఆలయాలతోపాటు, శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవేంకటేశ్వర ఆలయాన్ని కూడ స్వీకరించింది. ఆనాటినుండి తి.తి.దేవస్థానం పాలనలోకి వచ్చిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూనే ఉంది.

చాల దూరం నుంచే చూపరులకు దివ్య ప్రశాంత ధామంగా దర్శనమిచ్చే శ్రీకల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో ప్రవేశించుదాం. తెలిసినంతవరకు, తెలియవచ్చినంతవరకు ఆలయవిశేషాలను అవగాహన చేసుకుందాం.

## శ్రీ భక్తాంజనేయస్వామి

మహారాజ గోపురానికి ఎదురుగా ఆలయం వెలుపల ఇటీవలి కాలంలో శ్రీవారి సన్నిధికి ఎదురుగా శ్రీ భక్తాంజనేయస్వామివారి సన్నిధీ; ఈ రెండింటి మధ్య ఒక చిన్న కోనేరు నిర్మింపబడినాయి.

## మహాద్వార రాజగోపురం

1970 సంవత్సరంలో తి.తి.దేవస్థానాల శ్రీకార్యనిర్వాహకులుగా వుండిన శ్రీ యం.చంద్రమౌళిరెడ్డిగారు శ్రీనివాసమంగాపురం ఆలయ మహాద్వారరాజగోపురాన్ని, గర్భాలయం శిఖరాన్ని జీర్ణోద్ధరణ చేశారు. అప్పట్లో రాజగోపురంపై 7 సిమెంటుకలశాలను, గర్భాలయవిమానంపైన ఒక సిమెంటు కలశాన్ని ఏర్పాటు చెయ్యడం జరిగింది. వీటితో పాటు ఆలయానికి చుట్టురా మహాప్రాకారం నిర్మింపబడింది.

సుమారు పదేండ్లతర్వాత అంటే, 1980 సంవత్సరంలో కార్యనిర్వహణాధికారిగావున్న శ్రీ పి.వి.ఆర్.కె ప్రసాద్ గారి ఆధ్వర్యంలో మహాద్వార రాజగోపురంపైనా, విమాన గోపురంపైనా సిమెంటుకలశాలకు బదులుగా బంగారుతాపడం చేసిన కలశాలు ప్రతిష్ఠింపబడ్డాయి.

మహారాజ గోపుర ప్రదేశద్వారం సుమారు 10 అడుగుల ఎత్తైన శిల్పశోభితమైన రాతి అధిష్ఠానంపై ఇటుకలతో గోపురం 5 అంతస్థులతో అనేక శిల్పాలతో నిర్మింపబడింది. ప్రధానప్రవేశద్వారానికి ఇరువైపులా తాళ్లపాక అన్నమాచార్యులు వారి కుమారుడైన పెదతిరుమలాచార్యుల శిల్పాలు చెక్కబడివుండడం చూడవచ్చు.



దీన్నిబట్టి తాళ్లపాకవారు సర్వస్వతంత్ర అధికారంతో ఈ ఆలయాన్ని ఉద్ధరించడమేగాక ఆలయాన్ని చక్కగా నిర్వహించినట్లు స్పష్టమవుతుంది.

## బలిపీఠం-ధ్వజస్తంభం

ఇలా మనోహరమైన శిల్పాలతో నిండివున్న ప్రవేశద్వారాన్నీ దాటి లోనికి వెళ్లిన వెంటనే ఎదురుగా బంగారు బలిపీఠం, బంగారు ధ్వజస్తంభం కనిపిస్తాయి. అనేక కారణాలవల్ల కాలాంతరంలో ఇవి రెండు శిథిలమై అదృశ్యం కాగా, 1978 మార్చిలో రాతి బలిపీఠం, దారు (చెక్క) ధ్వజస్తంభం ప్రతిష్ఠింపబడినాయి. ఆ తర్వాత 2000 సంవత్సరంలో వీటికి బంగారు కవచం తాపబడింది.

చుట్టూరా వున్న చతురస్రాకారపు ఎత్తైన ప్రాకారపు గోడ మధ్యవున్న విశాలమైన ప్రాంగణంలో సుమారు 10 అడుగుల ఎత్తైన రాతి అధిష్ఠానంపై శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి ప్రధాన ఆలయం నిర్మింపబడింది.

ఈ ఆలయం ముఖమండపం (ఘంటామండపం), అర్ధమండపం, శయనమండపం, అంతరాళం, గర్భాలయం అని ఐదు భాగాలుగా వున్న మండపాలతో నిర్మింపబడింది.

## వంటశాల

బలిపీఠ, ధ్వజస్తంభాలకు దక్షిణంగా వంటశాల ఉంది. శ్రీస్వామివారికి నివేదింపబడే అన్నప్రసాదాలు అన్నీ ఈ వంటశాలలో తయారు చెయ్యబడతాయి.

## కల్యాణమండపం

ఆలయ ప్రాంగణంలో నైరృతిమూలలో శ్రీవారికల్యాణమండపం ఉంది. ఇందులో ప్రతిరోజు శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి నిత్యకల్యాణోత్సవం నిర్వహింపబడుతుంది.

## ఘంటా మండపం

ముఖమండపం అనే ఘంటామండపంలో శ్రీస్వామివారి మూలమూర్తికి ఎదురుగా పశ్చిమాభిముఖంగా గరుడాళ్వార్ సన్నిధివుంది. ఇందులోని ప్రాచీనమైన గరుడాళ్వారు శిలావిగ్రహం భిన్నమైనందున 1978 ఏప్రిల్ నెలలో గరుత్మంతుని కొత్త శిలావిగ్రహం ప్రతిష్ఠింపబడింది.

వరుసకు 6 వంతున 6 వరుసలుగా మొత్తం 36 శిల్పశోభితమైన శిలాస్తంభాలతో నిర్మితమైన ఈ చతురస్రాకార ముఖ మండపంలోనే వాయవ్యమూలన రెండు పెద్ద ఘంటలు వ్రేలాడ దీయబడినాయి. ఘంటలు ఉన్నందువల్ల ఘంటామండపని అంటారు. మండపానికి చుట్టూరా ఇనుపకటాంజనం అమర్చబడివుంది. ఈ మండపంలోనే జయవిజయులు కాపలాకాస్తున్న ద్వారానికి ఎదురుగా దక్షిణంగా వున్నమొదటివరుసలోని మూడవస్తంభంపై అన్నమయ్య శిల్పం మలచబడివుంది.

నివేదన జరిగే వేళల్లో మోగింపబడే ఈ ఘంటలలో ఒకదానిని తి.తి.దేవస్థానం ఏర్పాటు చేయగా, మరొక ఘంటను అప్పట్లో తి.తి.దేవస్థానం వైఖానసాగమ ఆస్థానపండితులుగా వుండిన శ్రీపండిత వేదాంతం జగన్నాథాచార్యులవారు, వారి తండ్రిగారైన స్వర్గీయ పండితవేదాంతం రామానుజాచార్యుల (గుంటూరు జిల్లా తెనాలితాలూకా మోపర్రుగ్రామం) వారి జ్ఞాపకార్థం 29-9-1971లో ఈ ఆలయానికి కానుకగా సమర్పించారు. ఇదే సందర్భంలో శ్రీజగన్నాథాచార్యులవారు, శ్రీహనుమత్సమేత శ్రీసీతారామలక్ష్మణ స్వామివారల పంచలోహవిగ్రహాలను, కొలువుశ్రీనివాసమూర్తి పంచలోహవిగ్రహాన్ని ఈ ఆలయానికి విరాళంగా సమర్పణ చేసుకున్నారు.

## ద్వారపాలకులు

ఈ ముఖమండపంలో ద్వారపాలకులైన జయవిజయుల నిలువెత్తు శిలావిగ్రహాలు వున్నాయి. అంతకుముందు ఉన్న సిమెంటు విగ్రహాల స్థానంలో 1998 ఆగష్టులో ఈ శిలామూర్తులు ప్రతిష్ఠ చేయబడినాయి.



## అర్ధమండపం

జయవిజయులు కాపలావున్న ద్వారాన్ని దాటి లోనికివెళితే అర్థమండపం వస్తుంది. దీన్నే స్నపనమండపం అంటారు. ఇందులోనే స్వామివారి నగలు, ఆభరణాలు భద్రపరచే గదులు చోటుచేసుకున్నాయి. విశాలమైన ఈ మండపాన్నిదాటి లోనికి వెళితే శయనమండపం వస్తుంది.

## శయనమండపం

ప్రతిరోజు రాత్రి ఈ శయన మండపంలో గొలుసులతో వేలాడదీసిన తూగుటుయ్యాలలో భోగశ్రీనివాసమూర్తికి పవళింపుసేవ జరుగుతుంది. దీన్నే ఏకాంతసేవ అంటారు. ఈ భోగ శ్రీనివాసమూర్తి రాగి విగ్రహాన్ని తాళ్లపాకవారు పూజించి ఈ ఆలయానికి సమర్పించారు. దీనితోపాటు తాళ్లపాకవారు తాము అనూచానంగా అర్చించిన గోదాదేవి చిన్న పంచలోహవిగ్రహాన్ని కూడా ఈ ఆలయానికి సమర్పించారు.

## అంతరాళం

శయనమండపాన్ని దాటితే అంతరాళం వస్తుంది. అంతరాళంలో దక్షిణం గోడకు ఉత్తరాభిముఖంగా ఆసీనభంగిమలో శ్రీలక్ష్మీనారాయణుల శిలావిగ్రహం వుంది. వామాంకంలో శ్రీమహాలక్ష్మిదేవి కూర్చొనివున్న ఈ శ్రీలక్ష్మీనారాయణుల శిలామూర్తి నయనాభిరామంగా దర్శనమిస్తున్నది. ఇదే మండపంలో ఉత్తర గోడకు పశ్చిమంగా తలనుపెట్టుకొని దక్షిణముఖంగా ఐదుపడగల ఆదిశేషునిపై శయనించివున్న శ్రీరంగనాథుని శిలామూర్తి దర్శనమిస్తుంది.

స్థిరమైన ఈ శిలామూర్తులతోపాటు ఈ అంతరాళంలోనే కులశేఖరపడి గడపకు ఇవతలే ఇరువైపులా తూర్పు ముఖంగా పంచలోహ ఉత్సవమూర్తులన్నీ వేంచేపు చేయబడివున్నాయి. పండిత వేదాంతం జగన్నాథాచార్యులవారు

సమర్పించిన శ్రీ సీతారామలక్ష్మణ హనుమంతుని విగ్రహాలు, కొలువు శ్రీనివాసమూర్తివిగ్రహం, తి.తి.దేవస్థానం ప్రతిష్ఠించిన శ్రీరుక్మిణీసత్యభామాసమేతశ్రీవేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులు ఈ మండపంలోనే వున్నాయి. అన్నమయ్య అర్చించిన శ్రీవేంకటేశ్వరుని, గోదాదేవి చిన్న విగ్రహాలు కూడా ఇక్కడే దర్శనమిస్తాయి.

వీటితోపాటు, బ్రహ్మోత్సవంలో, కల్యాణోత్సవంలో పాల్గొనే శ్రీదేవీ భూదేవీ సమేతంగ కల్యాణవేంకటేశ్వరుని పంచలోహ ఉత్సవవిగ్రహాలు, ఇంకా సుదర్శనచక్రత్తాళ్వార్ ఉత్సవవిగ్రహం, ఉగ్రశ్రీనివాసమూర్తి విగ్రహం- మొత్తం, ఐదు విగ్రహాలు కూడా ఇక్కడే వున్నాయి.

కాలాంతరంలో శిథిలమైన ఈ ఆలయం నుండి ప్రాచీనమైన ఈ ఐదు విగ్రహాలు తిరుపతి శ్రీకోదండరామాలయానికి తరలింపబడి భద్రపరచబడినాయి. అక్కడి నుంచి 1945 ప్రాంతంలో శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయంలోని ఓరియంటల్ పరిశోధనాసంస్థ మ్యూజియంకు తరలింపబడినాయి.

ఈ విషయాన్ని తెలుసుకున్న శ్రీనివాసమంగాపురం అర్చకులు శ్రీసుందరరాజస్వామి గట్టిగా ప్రయత్నంచేసి, వాటిని తిరిగి ఆలయానికి తెప్పించుటకు కృషి చేశారు. ప్రాచీనమైన ఈ ఐదువిగ్రహాలు, శ్రీనివాసమంగాపుర ఆలయంలో "చక్రత్తాళ్వార్ ప్రతిష్ఠాపనోత్సవం" పేరిట 11-9-1972 నుండి 13-9-1972 వరకు 3 రోజులపాటు ఉత్సవాలు జరిపిన సందర్భంలో పునః ప్రతిష్ఠింపబడినాయి.

తిరిగి ఆలయానికి చేరుకొని పునఃప్రతిష్ఠింపబడిన శ్రీదేవిభూదేవి సమేతంగా శ్రీకల్యాణ వేంకటేశ్వరుని ఉత్సవమూర్తులకు 1980 ఫిబ్రవరిలో మొదటిసారిగా బ్రహ్మోత్సవం, 1981 ఫిబ్రవరి 19న మొదటిసారిగా కల్యాణోత్సవం ఘనంగా జరుపబడినాయి. ప్రతినెలా శ్రవణనక్షత్రం రోజున సాయంత్రం ఉభయదేవేరులతో కూడివున్న శ్రీకల్యాణ వేంకటేశ్వరునకు ఊంజల్‌సేవ జరుపబడుతున్నది.



## గర్భాలయం

అంతరాళం నుండి కులశేఖరగడపను దాటి లోనికే వెళితే వుండేదే శ్రీవారిగర్భాలయం. సుమారు 12 అడుగుల చతురస్రాకారపు గర్భాలయం మధ్య భాగాన పీఠంతో కూడా సుమారు 10 అడుగులకు పైగా ఎత్తువున్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారు నయనమనోహరంగా భక్తులకు దర్శనమిస్తారు. నిలుచున్న (స్థానక) భంగిమలో శిలామూర్తిగా, తూర్పుముఖంగా ప్రతిష్ఠింపబడిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారు, తిరుమలేశుని మాదిరిగానే లక్ష్మీదేవిని వ్యూహలక్ష్మిగా ఉంచుకొని వున్నప్పటికీ ఇచ్చటి మూర్తిమాత్రం కొంచెం పెద్దదిగా వుంది.

మూలమూర్తి కొలువైవున్న గర్భాలయంపైన సుమారు 25 అడుగుల ఎత్తువున్న ఏక కలశ విమానం త్రితల గోపురంగా నిర్మింపబడివుంది. గర్భాలయంమీద నాలుగుమూలల్లో చుట్టూరా తిరుమలలో వలెనే సింహాల శిల్పాలు ఏర్పాటు చేయబడినాయి. విమానగోపురంపైన దక్షిణవైపు నరసింహస్వామి, పశ్చిమదిక్కున శ్రీలక్ష్మీనారాయణస్వామి, ఉత్తరదిక్కున నారాయణుడు, గర్భాలయానికి బయటివైపు చుట్టూరా వున్న గూళ్లలో గణపతి, అనంతుడు, మహిషాసురమర్దని లాంటి విగ్రహాలు ప్రతిష్ఠింపబడినాయి.

## శ్రీవారి మూలమూర్తి

శ్రీ స్వామివారు తిరుమలలోవలెనే చతుర్భుజుడై పైరెండు చేతుల్లో శంఖచక్రాలను ధరించి వున్నాడు. క్రింది రెండుచేతులు వరదకటిహస్తాలుగా విరాజిల్లుతూ వున్నాయి. చిన్మయహాసంతో నొసటన పెద్దనామంతో స్వామివారు దర్శనమిస్తున్నాడు. శ్రీస్వామివారి పాదాలచెంత తాళ్లపాక వంశీయులు సమర్పించిన 'భోగశ్రీనివాసమూర్తి' అనే శ్రీనివాసుని ఒక అడుగు ఎత్తువున్న రాగిమూర్తిని దర్శించవచ్చు. ఈ మూర్తికే ప్రతిరోజు రాత్రి పవళింపుసేవ అనే ఏకాంతసేవ జరుగుతుంది.

గర్భాలయంలోని మూలమూర్తికి ప్రతిరోజు ఉదయం సుప్రభాతం, ఉదయం, సాయంత్రం రెండుమార్లు తోమాలసేవ అనబడే పుష్ప కైంకర్యం, ఉదయం సహస్రనామార్చన, మధ్యాహ్నం, సాయంత్రం రెండువేళలా అష్టోత్తరశతనామార్చన. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలూ నివేదనలూ జరుపబడుతున్నాయి. ఉదయంపూట దధ్యోదనం, పులిహోర, మధ్యాహ్నంపూట పులిహోర, చక్కెరపొంగలి, సాయంత్రం ముళహోర నివేదింపబడుతున్నాయి.

ప్రతి గురువారం ఈ మూలమూర్తికి రెండవగంట నైవేద్యకాలంలో అనగా ఉదయం 9 గంటల వేళలో తిరుప్పావడసేవ, నేత్రదర్శనం, ఆ రాత్రి పూలంగిసేవ, జరుగుతుంది. ప్రతి శుక్రవారం ఉదయం 8 గంటలకు పునుగుజవ్వాజి, పచ్చకర్పూరం, కుంకుమపువ్వు మున్నగు సుగంధ ద్రవ్యాలతో మూలమూర్తికి అభిషేక సేవ జరుపబడుతున్నది. అభిషేకానంతరం వస్త్ర సమర్పణ, నొసట్లో 450 గ్రాముల పచ్చకర్పూరంతో నామసమర్పణ జరుగుతుంది. దీన్నే తిరుమణికాపు అంటారు.

ప్రతిరోజు రాత్రి ఏకాంతసేవలో గోరువెచ్చని చక్కెర కలిపిన ఆవుపాలు, పంచకజ్జాయం నివేదన చేయబడతవి.

మూలమూర్తి అయిన శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామికి 1980లో బంగారు కవచాలు సమర్పింపబడినాయి. ఇవిగాక వజ్రాలు తాపిన తిరునామాలు, కిరీటం, కర్ణపత్రాలు, శంఖచక్రాలు, వరద కటిహస్తాలు, పాదకవచాలు...ఇవన్నీ నెల్లూరుకు చెందిన రేబాల తిరుమలమ్మ విరాళమిచ్చారు.

చెన్నై వాస్తవ్యులు సాహితీవేత్తలు, పరిశోధకులు మీదుమిక్కిలి నాట్యవిశారదులు అయిన శ్రీ.వి.ఎ.కె.రంగారావుగారు, వెండి సహస్రనామాల లక్ష్మీహారాన్ని, దశావతార వడ్డాణాన్ని, కంఠహారాలను



సూర్యకఠారిని, వెండినగలను మూలవిరాట్టునకు సమర్పించడమేగాక, ప్రతి సంవత్సరం సాక్షాత్కార వైభవోత్సవంనాడు స్వయంగా కాళ్లకు గజ్జెలు కట్టుకొని స్వామివారిముందు భరతనాట్యసేవను చేసుకొంటున్నారు.

మద్రాసువాస్తవ్యులైన శ్రీ పిచ్చుక వెంకటసుబ్బయ్య శ్రీస్వామివారి మూలమూర్తికి వెండి నాగాభరణాలతో పాటు వెండి కుంభహారతికలశాన్ని, రెండు అభిషేక వెండిబిందెలను సమర్పించుకున్నారు.

11-7-1940 నాడు అప్పుడు అర్చకులు శ్రీ సుందరరాజస్వామివారు తొలిసారి సాక్షాత్కార వైభవోత్సవాన్ని ప్రారంభించినది మొదలు 1-2-79నాడు వారు పరమపదించువరకు శ్రీనివాసమంగాపురం ఆలయంలో ప్రధాన అర్చకులుగానే సేవలందించారు. వీరికి సహాయఅర్చకులుగా చాలకాలం సేవలందించిన వారి దత్తపుత్రులు శ్రీరాఘవేంద్రాచార్యులు ప్రస్తుతం తి.తి.దేవస్థానంవారి విశ్రాంత అర్చకులుగా శ్రీనివాసమంగాపురంలోనే వున్నారు. (ఇందులోని 'తాయారమ్మ' చరిత్రను, సుందరాజస్వామి చరిత్రను సేకరించడంలో శ్రీరాఘవేంద్రాచార్యులతో పాటు మరికొందరు గ్రామస్థులు సహకరించారు).

ప్రధానంగా శ్రీసుందరరాజస్వామి మధ్వాచార్యులసంప్రదాయంలోని తంత్రసారాగమం ప్రకారంగా పూజలు నిర్వహించేవారు. వారి అనంతరం అనగా 9-4-2004 నాటి నుండి శ్రీనివాస మంగాపురం ఆలయంలో పూర్తిగా వైఖానసఆగమశాస్త్రానుసారంగా పూజలు నిర్వహించునట్లుగా ఏర్పాటుచేయబడి నేటికీ కొనసాగుతూవున్నాయి.

2007 అక్టోబరు 28 నుండి నవంబరు 1వ తేదీవరకు 5 రోజులపాటు జరిగిన మహాసంప్రోక్షణతో శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరాలయం మరింత జాజ్వల్యమానంగా ప్రకాశిస్తూ భక్తలోకాన్ని స్ఫూర్తిమంతంగా ఆకర్షిస్తూవుంది.

ఆశ్రితభక్తవరదుడైన శ్రీకల్యాణశ్రీనివాసుని మరెన్నో విధాలుగా భక్తులు తమకు నచ్చిన రీతిలో తాము మెచ్చిన తీరులో పాల్గొని సేవించడానికై తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీనివాసునకు నిత్యోత్సవాలు, వారోత్సవాలు, మాసోత్సవాలు, సంవత్సరోత్సవాలను ప్రారంభించింది.

## ఉత్సవవైభవం

శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి ఆలయం తి.తి.దేవస్థానంవారి పర్యవేక్షణలో దిన దినాభివృద్ధి చెందుతూ ఉంది. ఉత్సవాలలో, ఊరేగింపులతో అంగరంగవైభవంగా తిరుమలక్షేత్రానికి దీటుగా భక్తులతో కిటకిటలాడుతూ ఉంది.

తిరుమలక్షేత్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామివారికి వలెనే శ్రీనివాసమంగాపురంలో కూడా వైఖానసాగమ శాస్త్రరీతిగ స్వతంత్రంగ షట్కాలార్చనలు, ఉత్సవాలు, సేవలు నిర్వహింపబడుతున్నాయి. ఈ ఉత్సవాలను 1. నిత్యోత్సవాలు, 2. వారోత్సవాలు, 3. మాసోత్సవాలు, 4. వార్షికోత్సవాలు–అని నాలుగు రకాలుగా విభజించి పరిశీలించుదాం.

## నిత్యోత్సవాలు

ప్రతిరోజు విధిగా జరిగే సేవలను నిత్యోత్సవాలు అంటారు.

**1. సుప్రభాతం :** ప్రతి రోజు తెల్లవారుజామున 5 గంటలకు 'కౌసల్యా సుప్రజా రామ!' –అంటూ సుప్రభాతాన్ని పఠిస్తు శ్రీస్వామివారిని మేల్కొల్పే సేవ ఇది. నిర్ణీతరుసుమును చెల్లించిన భక్తులు ఈ సేవలో పాల్గొనవచ్చు.

**2. తోమాలసేవ :** ప్రతి రోజు ఉదయం 6.30 గంటల సమయంలో శ్రీస్వామివారి మూలమూర్తికి, ఉత్సవమూర్తులకు జరిగే పుష్పాలంకరణను 'తోమాలసేవ' అంటారు. నిర్ణీతరుసుమును చెల్లించిన భక్తులు ఈ సేవలో పాల్గొని పుష్పకైంకర్యసేవను తిలకించవచ్చు.



**3. సహస్రనామార్చన :** పుష్పాలంకరణ తర్వాత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికి 1008 నామాలలో తులసితో అర్చన జరుగుతుంది. పిదప శ్రీస్వామివారి పాదాలకు సమర్పించిన తులసితో 24 నామాలతో వక్షఃస్థల అమ్మవారికి అర్చన జరుగుతుంది. ఈ అర్చనసేవలో భక్తులు నిర్ణీతరుసుమును చెల్లించి పాల్గొని దర్శించవచ్చు.

అర్చన అయినతర్వాత ఏకాంతంగా శ్రీవారికి నివేదన జరుపబడుతుంది.

**4. నిత్యకల్యాణోత్సవం :** ప్రతి రోజు మధ్యాహ్నం 11 గంటలసమయంలో శ్రీదేవిభూదేవి సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి కల్యాణమండపంలో ప్రతిరోజు కల్యాణోత్సవం జరుపబడుతుంది. నిర్ణీతరుసుమును చెల్లించిన గృహస్థులు కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు.

కల్యాణోత్సవానంతరం ప్రసాదింపబడే శ్రీవారికల్యాణకంకణాలను, అవివాహితులు ధరించినట్లయితే వారికి త్వరలోనే వివాహం జరుగుతుందని ప్రతీతి!

**5. ఆర్జితబ్రహ్మోత్సవం :** ప్రతి రోజు కల్యాణోత్సవానంతరం. మధ్యాహ్నం 12 $\frac{1}{2}$ గంటల సమయంలో ముఖమండపంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరుని ఉత్సవమూర్తులకు ఆర్జిత బ్రహ్మోత్సవం నిర్వహింపబడుతుంది. ఈ సేవ మాత్రం నిర్ణీత రుసుమును చెల్లించిన భక్తుల కోరికమేరకుమాత్రమే నిర్వహింపబడుతుంది. అశ్వవాహనం, హనుమద్వాహనం, గరుడవాహనాలపై మాత్రమే శ్రీస్వామివారిని వేంచేపుచేసి, కర్పూర మంగళ నీరాజనాలివ్వడంతో ఈ సేవపూర్తి అవుతుంది.

**6. ఏకాంతసేవ :** శయనమండపంలో గొలుసులతో వేలాడదీయబడిన తూగుటుయ్యాల మంచంపై భోగశ్రీనివాసమూర్తిని శయనింపజేసే వేడుకే

ఏకాంతసేవ అంటారు. ప్రతి రోజురాత్రి 8 గంటల సమయంలో జరిగే ఈ ఏకాంతసేవలో నిర్ణీతరుసుమును చెల్లించినభక్తులు పాల్గొనవచ్చు.

## వారోత్సవాలు

వారానికి ఒకరోజు ప్రత్యేకమైన ఉత్సవంగా విధిగా జరుపబడే ఉత్సవాలు ఇవి.

**1. స్వర్ణపుష్పార్చన :** ప్రతి మంగళవారం ఉదయం 9 గంటలకు 108 బంగారు పుష్పాలతో శ్రీకల్యాణవేంకటేశ్వరుని మూలమూర్తికి అష్టోత్తర శతనామార్చన జరుగుతుంది. నిర్ణీతరుసుమును చెల్లించిన గృహస్థులు ఈ సేవలో పాల్గొని దర్శించవచ్చును.

**2. శతకలశాభిషేకం :** ప్రతి బుధవారం ఉదయం 9 గంటలకు 108 కలశాల పుణ్యజలాలతో శ్రీదేవిభూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులకు ముఖమండపంలో గరుడాళ్వారు ఎదురుగా జరుగుతుంది. నిర్ణీత రుసుమును చెల్లించిన గృహస్థులు ఈ శతకల శాభిషేకంలో పాల్గొని దర్శించవచ్చు.

**3. తిరుప్పావడసేవ :** ప్రతి గురువారం ఉదయం 9 గంటలకు శ్రీవారి మూలమూర్తికి జరిగే సేవ ఇది. ఇందులో శ్రీస్వామివారికి పులిహోరరాశిని నివేదిస్తారు. దీన్నే "అన్నకూటోత్సవం" అంటారు. నిర్ణీతరుసుమును చెల్లించిన గృహస్థులు ఇందులో పాల్గొని దర్శించవచ్చు.

**4. నేత్రదర్శనం :** ఆ తర్వాత శ్రీస్వామివారు నొసటన సన్నని నామంతో దర్శనమిస్తారు. దీన్నే నేత్రదర్శనోత్సవం అంటారు. భక్తులు అందరు గురువారం నాటి పగటివేళలో ఉచితంగ దర్శించవచ్చు.

**5. పూలంగిసేవ :** ఆ రాత్రి "పూలంగిసేవ"లో దర్శనమిస్తారు. శ్రీస్వామివారి మూలమూర్తి నిలువెత్తు పూలమాలలతో అలంకరించడమే పూలంగిసేవ అంటారు. ఉచితంగా భక్తులు దర్శించవచ్చు.

**6. అభిషేకం :** ప్రతి శుక్రవారం ఉదయం 6.00 గంటల సమయంలో శ్రీస్వామివారి మూలమూర్తికి పునుగుజవాజి పచ్చకర్పూరం మున్నగు సుగంధ ద్రవ్యాలను కలిపిన పవిత్రజలాలతో అభిషేకం నిర్వహిస్తారు. నిర్ణీత రుసుమును చెల్లించిన గృహస్థులు ప్రతి శుక్రవారం జరిగే అభిషేకంలో పాల్గొని దర్శించవచ్చు.

**7. వస్త్రాలంకారసేవ :** ప్రతి శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో అభిషేకానంతరం శ్రీస్వామివారి మూలమూర్తికి అలంకరించే పట్టువస్త్రాలసమర్పణ. అలంకరణసేవ ఇది. నిర్ణీత రుసుమును చెల్లించిన గృహస్థులు ఈ సేవలో పాల్గొని దర్శించవచ్చు.

**8. గ్రామోత్సవం :** ప్రతి శనివారం నాడు సాయంత్రం 5 గంటల సమయంలో శ్రీదేవిభూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారికి బంగారుతిరుచ్చిలో గ్రామోత్సవం జరుగుతుంది. ఈ ఊరేగింపు వేళలో భక్తులు ఎవరైనా స్వామిని దర్శించవచ్చు.

## మాసోత్సవాలు

నెలకు ఒక్కసారి మాత్రమే జరుపబడే ఉత్సవాలు ఇవి.

**1. శ్రవణ నక్షత్రోత్సవం :**

ప్రతి నెలా శ్రవణ నక్షత్రం నాడు సాయంత్రం 5 గంటలకు సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవ జరుగుతుంది. నిర్ణీతరుసుమును చెల్లించిన గృహస్థులు ఈ సేవలో పాల్గొనవచ్చు.

## వార్షికోత్సవాలు

సంవత్సరానికి ఒక్కమారు జరిగే ఉత్సవాలు కనుక సంవత్సరోత్సవాలు అనీ, వార్షికోత్సవాలు అని అంటారు. ఈ వార్షికోత్సవాలు తెలుగు ఉగాదితో ప్రారంభమై ఉగాదికి ముందురోజుకు సమాప్తమవుతాయి.

## ఉగాది ఆస్థానం

ఆలయం ముఖమండపంలో ఉగాది రోజున ఉదయం 9 గంటలకు శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులను బంగారు తిరుచ్చిలో వేంచేపుచేసి ఆస్థానం జరుపుతారు. ఈ ఆస్థానంలో పంచాంగ శ్రవణం, సంవత్సర ఫలితాలు, వినిపించిన తర్వాత స్వామివారికి ధూపదీపనివేదనలు, మంగళహారతులు జరుగుతాయి. ఊరేగింపు జరుగుతుంది.

## శ్రీరామనవమి

శ్రీహనుమత్సమేత శ్రీసీతారామలక్ష్మణస్వామి విగ్రహమూర్తులకు ముఖ మండపంలో ఆస్థానం నివేదన హారతులు జరుపబడతవి. సాయంత్రం ఊరేగింపు జరుగుతుంది.

## వసంతోత్సవం

ప్రతి సంవత్సరం వైశాఖమాసంలో శ్రవణనక్షత్రం నాటికి పూర్తి అయ్యేట్లుగా మూడురోజులపాటు శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి వార్షిక వసంతోత్సవాలు జరుగుతాయి.

మొదటిరోజు, రెండవరోజు శ్రీదేవిభూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారికి, మూడవరోజున శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామివారలతోపాటు, శ్రీకోదండరామస్వామివారికి, శ్రీకృష్ణస్వామి వార్లకు వసంతోత్సవం నిర్వహింపబడుతుంది. ఆ సాయంత్రం ఊరేగింపు ఉంటుంది.

## సాక్షాత్కారవైభవం

1940. జూలై 11 వ తేదీన ఆషాఢ శుద్ధ సప్తమి ఉత్తరఫల్గునీ నక్షత్రంనాడు అప్పటి అర్చకులు శ్రీసుందర రాజస్వామివారి స్వప్నాదేశం మేరకు "సాక్షాత్కారవైభవం" ఘనంగా జరిగింది.



ఆనాటి సంఘటనను పురస్కరించుకొని తి.తి.దేవస్థానం ప్రతి ఏటా ఆషాఢ శుద్ధ సప్తమి లేదా ఉత్తరఫల్గునినాటికి ముందురోజు తర్వాతిరోజు ఇలా 3 రోజులపాటు ప్రతి ఏటా "సాక్షాత్కారవైభవోత్సవాలు" పేరిట ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నది. శ్రీదేవిభూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారికి మొదటిరోజు సాయంత్రం తిరుచ్చి వాహనం. రెండవరోజు హనుమద్వాహనం, మూడవరోజున గరుడోత్సవం జరుగుతుంది.

ఈ మూడురోజులపాటు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

## ఆణివార ఆస్థానం

ప్రతి సంవత్సరం జూలై 16 లేదా 17వ తేదీన శ్రీదేవిభూదేవి సమేతంగా శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి దక్షిణాయన పుణ్యకాలంలో ఆణివార ఆస్థానం జరుగుతుంది. సాయంత్రం ఊరేగింపు జరుగుతుంది.

## పవిత్రోత్సవాలు

అర్చనాదుల్లో కాని, సేవల్లోకాని, ఆలయసిబ్బంది లేదా యాత్రికులవల్ల కాని తెలిసీ, తెలియక జరిగే దోషాలవల్ల ఆలయ పవిత్రత కొంత తగ్గవచ్చు. ఆలోపాల పరిహారణార్థం జరిపే ఉత్సవాలే పవిత్రోత్సవాలు

ప్రతి సంవత్సరం శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆశ్వయుజ బహుళద్వాదశికి పూర్తి అగునట్లు మూడురోజులపాటు పవిత్రోత్సవాలు జరుగుతాయి. అంతకు ముందురోజు సాయంత్రం ఈ ఉత్సవాలకు అంకరార్పణ జరుగుతుంది.

## ధనుర్మాసం

డిశంబరు 15 లేదా 16 నుండి ప్రారంభమయ్యే ధనుర్మాసంలో నెలరోజులపాటు సుప్రభాతపఠనం ఉండదు. గోదాదేవి తిరుప్పావైని పఠిస్తారు. భోగ శ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామివారికి పవళింపు సేవ ఉంటుంది. ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి ద్వాదశినాడు, ప్రత్యేక పూజలు, ఉంటాయి. జనవరిలో సంక్రాంతి పండుగనాటికి ధనుర్మాసం ముగుస్తుంది.

## బ్రహ్మోత్సవాలు

ప్రతి సంవత్సరం మాఘమాసంలో అనగా సౌరమానం ప్రకారం కుంభమాసంలో శ్రవణనక్షత్రానికి పూర్తి అగునట్లు 9 రోజుల ముందునుంచి శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. తొమ్మిదిరోజులపాటు ప్రతిరోజు ఉదయం సాయంత్రం శ్రీస్వామివారికి వాహనసేవలు జరుగుతాయి. 9 వ రోజు ఉదయం రథోత్సవం జరుగుతుంది. పదవరోజు ఉదయం చక్రస్నానంతో ఉత్సవాలు పూర్తి అవుతాయి.

## పుష్పయాగం

బ్రహ్మోత్సవంలో జరిగే దోషాల పరిహారణార్థమేగాక దేశక్షేమంకోసం, ప్రతి సంవత్సరం ఫాల్గుణమాసంలో శ్రవణనక్షత్రం రోజున ఒక్కరోజు మాత్రమే శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి పుష్పయాగోత్సవం వైభవంగా జరుపబడుతుంది. ఆ సాయంత్రం ఊరేగింపు జరుగుతుంది.

వేంకటాచలక్షేత్రం భువిలో వెలసిన నాటినుండి ప్రశస్తి నందిన శ్రీనివాసమంగాపురక్షేత్రాన్ని కూడా తిరుమలకు దీటుగా, సాటిగా అభివృద్ధి పరచాలన్న ధ్యేయంతో తి.తి.దేవస్థానం, పెద్దఎత్తున ప్రయత్నిస్తోంది.



ఇలా నిత్యోత్సవ, వారోత్సవ మాసోత్సవ సంవత్సరోత్సవాలతో అనునిత్యం కోలాహలంగా భక్తుల సందడితో శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం దిన దినాభివృద్ధి చెందాలనీ భక్తులకు ఇష్టార్థాలను ప్రసాదిస్తూ కోరినవారిపాలిటి సిద్ధిక్షేత్రంగా, సాధనాక్షేత్రంగా భాసించేట్లుగా కల్యాణశ్రీనివాసపరంధాముని ఇలా ప్రార్థించుదాం.

**హైమోర్ధ్వపుంఢ్ర మజహన్మకుటం సునాసం**
**మందస్మితం మకరకుండల చారుగండమ్**
**బింబాధరం బహుల దీర్ఘ కృపాకటాక్షం**
**శ్రీవేంకటేశముఖ మాత్మని సన్నిధత్తామ్.**

**కందర్పకోటిసదృశం కమనీయవేషం**
**ముక్తావళీలలితకంఠ ముదారహారమ్**
**పీతాంబర ద్యుతివిరాజితదివ్యదేహం**
**శ్రీవేంకటేశవపురాత్మని సన్నిధత్తామ్**

**ఓం నమో వేంకటేశాయ**

## సృష్టి-స్థితి-లయం

శ్రీనివాసమంగాపురంలోని గర్భాలయంలో మూడు శిలా విగ్రహాలు వున్నాయి. ఇవి స్థిరప్రతిష్ఠితములు, అనగా కదలకుండా వుండేవి.

వీటిలో గర్భాలయంలమధ్యభాగాన నిలువెత్తు స్థానకమూర్తిగా శ్రీకల్యాణవేంకటేశ్వరుడు, వక్షఃస్థల వ్యూహలక్ష్మితో స్థానకభంగిమ (నిలబడి)లో దర్శనమిస్తాడు.

గర్భాలయం వెలుపల అనగా కులశేఖరపడి దాటిన వెంటనే వుండే అంతరాళంలో

ఉత్తరంగోడవారకు ఆనుకొని శేషశాయిగా దక్షిణముఖంగా శ్రీరంగనాథస్వామి శయనభంగిమలోను, దక్షిణ గోడవారకు ఉత్తరాభిముఖంగా శ్రీలక్ష్మీనారాయణులు కూర్చున్నభంగిమలోను ప్రతిష్ఠింపబడ్డారు.

శ్రీకల్యాణవేంకటేశ్వరుడు (నిలుచున్నవాడు) శ్రీలక్ష్మీనారాయణులు (కూర్చున్నవారు), శ్రీరంగనాథుడు (పడుకొన్నవాడు). ఇలా ఈ మూర్తులు సృష్టి స్థితి లయాలకు సంకేతంగా పెద్దలు చెబుతారు.



## సమర్పణ



**శ్రీ శ్రీనివాసః పరదైవతం నః**
**శ్రీ శ్రీనివాసః పరమం ధనం నః**
**శ్రీ శ్రీనివాసః కులదైవతం నః**
**శ్రీ శ్రీనివాసః పరమాగతి ర్నః**

జగత్కల్యాణదంపతులైన శ్రీపద్మావతీ శ్రీనివాసులు నేటికీ నిత్యనూతన వధూవరులై దర్శనమిస్తున్న నిత్యకల్యాణపురం శ్రీనివాసమంగాపురం! భక్తులకు ఇబ్బడిముబ్బడిగా కల్యాణపరంపరలను ప్రసాదించాలని ప్రార్థిస్తూ దివ్యదంపతులైన శ్రీపద్మావతీశ్రీనివాసుల పాదపద్మాలకు ఈ చిన్నిపుస్తక సుమాన్ని సమర్పించుకుందాం!

**శ్రియఃకాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్**
**శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయమంగళమ్.**

* * * * *

## బౌళి

ఏమివలసిన నిచ్చు నెప్పుడైనను
యేమరక కొలిచిన నీతఁడే దైవము ॥పల్లవి॥

ఘనముగా నిందరికిఁ గన్నులిచ్చుఁ గాళ్లిచ్చు
పనిసేయఁ జేతులిచ్చు బలియుఁడై
తనుఁ గొలువుమని చిత్తములిచ్చుఁ గరుణించి
వొనర లోకానకెల్ల నొక్కఁడే దైవము ॥ఏమి॥

మచ్చిక తనుఁగొలువ మనసిచ్చు మాటలిచ్చు
కుచ్చితములేని కొడుకుల నిచ్చును
చొచ్చినచోటే చొచ్చి శుభమిచ్చు సుఖమిచ్చు
నిచ్చలు లోకానకెల్ల నిజమైనదైవము ॥ఏమి॥

పంతమాడి కొలిచినఁ బ్రాణమిచ్చు ప్రాయమిచ్చు
యెంతటి పదవులైన నిట్టె యిచ్చు
వింత వింత విభవాల వేంకటేశుఁడిదె మా-
యంతరంగమున నుండే అరచేతి దైవము ॥ఏమి॥

